




ఆలూరు పట్టణం కోయా నగరంలోని ప్రజాపంపిణీ దుకాణం వద్ద ఆదివారం రాయితీ బియ్యం కోసం క్యూకట్టిన కార్డుదారులు

కాయితాల మీదే ఇంటింటికి బియ్యం

ఆలూరు/కర్నూలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):
ఆలూరు పట్టణం కోయా నగరంలో పౌర సరఫరా దుకాణం-31 వద్ద ఆదివారం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ బియ్యం కోసం కార్డుదారులు క్యూ కట్టారు. ఇంటింటికి వెళ్లి పేదలకు బియ్యం పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాలు ఉన్నాయి కదా..? ఆ వాహనాల ఆపరేటర్లకు నెలకు రూ.26,500 జీతాలు ఇస్తున్నారు. అయినా ప్రజా పంపిణీ దుకాణాలకు బియ్యం కోసం కార్డుదారులు ఎందుకు వస్తున్నారు..? విచారిస్తే విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. ఏడాది కాలంగా ఎండీయూ వాహనాలు రోడ్డెక్కలేదు. అయినా.. నెలనెలా ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేసి ఆపరేటర్లకు రెవిన్యూ అధికారులు జీతాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఆలూరులో ఒక్కటే కాదు.. జిల్లాలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి.

జిల్లాలో ఏపీ ప్రభుత్వ ప్రజా పంపిణీ (సివిల్ సప్లయ్) విభాగం పర్యవేక్షణలో 1,233 నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలు ఉన్నాయి. 6.72 లక్షల రేషన్ కార్డుదారులకు ప్రతి నెల 9-10 వేల మెట్రిక్ టన్నుల రాయితీ బియ్యం సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్కరికి 5 కిలోలు చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికి ఇస్తున్నారు. పౌర సరఫరాల విభాగం నిత్యావసర సరుకుల దుకాణాలు ద్వారా బియ్యం, పప్పు, వంటనూనె.. వంటి రాయితీ సరుకులు ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి సరఫరా చేయాలనే లక్ష్యంగా ఎండీయూ వాహనాలను తీసుకొచ్చారు. జిల్లాలో 409 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్న వాహనాల ఆపరేటర్లు, హెల్పర్ ఇద్దరికి నెలకు రూ.26,500 చెల్లిస్తున్నది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పేదలకు ఇంటికే నిత్యావసర సరకులు అందుతాయనే లక్ష్యంగా ఈ వాహనాలు కొనసాగిస్తున్నారు. మెజార్టీ వాహన ఆపరేటర్లు వైసీపీ మద్దతుదారులు అని సమాచారం. డిసెంబరు కోటా రాయితీ బియ్యం పంపిణీ ఆదివారం మొదలైంది. ఎండీయూ వాహనాలు ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నారా..? ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆసక్తి విషయాలు వెలుగు చూస్తున్నాయి. పలు మండలాల్లో వాహనాలు రోడ్డెక్కకపోయినా రికార్డుల్లో మాత్రం బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చూపించి ఆపరేటర్లకు జీతాలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు నగరంలో వాహన ఆపరేటర్లు కొందరు బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు వెలుగు చూస్తుంది.

- రోడ్డెక్కని ఎండీయూ వాహనాలు
- ఆపరేటర్లకు జీతాలు చెల్లిస్తున్న రెవెన్యూ అధికారులు
- ఆలూరులో ఏడాదిగా సాగుతున్న భాగోతం
- బియ్యం అక్రమ రవాణా చేస్తున్న పలువురు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు
- కిలో రూ.10కు కొనుగోలు చేస్తున్న వైనం



ఆలూరు పట్టణం ఉపాధ్యాయ నగరంలో ఆపరేటర్ ఇంటి ముందు ఆపేసిన ఎండీయూ వాహనాలు. దుమ్మూధూళితో నిండిపోయాయి. టీడీపీ ప్రభుత్వం రాక ముందు నుంచే ఈ వాహనాలు రోడ్డెక్కలేదని తెలుస్తోంది.

ఆలూరు మండలంలో ఏపీ సివిల్ సప్లయ్ దుకాణాలు 33, రేషన్ కార్డుదారులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసేందుకు 10 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. వాహన ఆపరేటర్, అసిస్టెంట్ ఇద్దరికి రూ.26,500 చెల్లిస్తున్నారు. కోయా నగరం సివిల్ సప్లయ్ షాప్-31 వద్ద రాయితీ బియ్యం కోసం కార్డుదారులు బారులు తీరారు. విచారిస్తే. ఏడాదిగా ఎండీయూ వాహనదారులు బియ్యం పంపిణీ చేయడం లేదని కార్డుదారులు తెలిపారు. ఏ ఒక్క వాహనం కూడా రోడ్డెక్కలేదని తెలుస్తోంది. అయితే.. రెవిన్యూ రికార్డుల్లో మాత్రం నెలనెల ఎండీయూ వాహన ఆపరేటర్లు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చూపించి ఒక్కో వాహనానికి రూ. 26.500 చెల్లిస్తున్నారు. పది వాహనాలకు

రోడ్డెక్కకపోయినా ఆపరేటర్లకు జీతాలు

నెలకు రూ.2.65 లక్షలు చొప్పున ఏడాది కాలంలో రూ.31.80 లక్షలు చెల్లించినట్లు తెలుస్తున్నది. ఆ వాహనాలు ఎక్కడున్నాయో ఆరా తీయగా ఉపాధ్యాయ నగర్‌లోని ఆపరేటర్ ఇంటి ముందు మూడు వాహనాలు ఆపేశారు. వాటికి మాజీ సీఎం జగన్ ఫొటో స్టిక్కర్ కూడా తొలగించలేదు. దుమ్ము దూళితో నిండిపోయాయి. అంటే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వాహనాలు రోడ్డెక్కలేదని తెలుస్తున్నది. అయినా.. బియ్యం పంపిణీ చేసినట్లు రికార్డుల్లో చూపించి నెలనెలా రెవిన్యూ అధికారులు

జీతాలు ఇవ్వడం వెనుక అంతర్యమేమిటి..? ఈ భాగోతంలో అధికారులకు కూడా వాటా ఉందన్న ఆరోపణలు లేకపోలేదు. హొళగుంద, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు మండలాల్లో కూడా ముప్పాతిక శాతం ఎండీయూ వాహనాలు రోడ్డెక్కడం లేదని తెలుస్తున్నది. జిల్లాలో చాలా మండలాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. రెవిన్యూ అధికారుల వివరణ కోరిన తరువాత హడావుడిగా ఒకటి రెండు వాహనాలు రోడ్డెక్కడం కొసమెరుపు.

మిగతా 6లో..

సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ రంజిత్ బాషా



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరిం చారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి అర్జీలను ఇంకా మెరుగ్గా పరిష్కరించాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో ఇప్పటి వరకు ఎట్ టూ వ్యూ కేసులు సర్వే, రెవెన్యూ శాఖలో ఎక్కువ శాతం ఉన్నాయని, వాటిని ముందు ఓపెన్ చేసి చూసి పరిష్కారం చేయాలని అన్నారు. రీఓపెన్ కేసులకు సంబంధించి మొత్తం 33 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెరిఫై చేసి నాణ్యతతో పరిష్కరించాలని, జాగ్రత్తగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని అన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఇంకా 18 పెండింగ్‌లో ఉన్నాయని, వాటి మీద ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి ఆదాయం రూ.2.21 కోట్లు



మహానంది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానానికి కార్తీక మాసం పురస్కరించుకొని వివిధ సేవల ద్వారా రూ.2,21,23,830 కానుకలు వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు క్షేత్రంలో జరిగిన కార్తీక మాసో త్సవాల్లో భాగంగా లక్షలాది మంది భక్తులు దైవదర్శనం వచ్చారని చెప్పారు. గత ఏడాది కార్తీక మాసం సందర్భంగా రూ.1,73,39,091 రాగా, ఈ ఏడాది రూ.47,84,739 అధికంగా వచ్చాయని అన్నారు.

అన్నీ అవే పన్నులు..!

- బకాయిలన్నీ ప్రభుత్వ కార్యాలయాలవే..
- 30 ఏళ్లుగా చెల్లించకున్నా పట్టని వైనం
- పెండింగ్‌లో రూ.2 కోట్లకు పైనే..
- మున్సిపల్ అధికారుల తాత్సారంపై విమర్శలు



ఎమ్మిగనూరు పురపాలక సంఘం కార్యాలయం

ఎమ్మిగనూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల పన్నులు పేరుకు పోయాయి. ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో ముందంజలో ఉన్న అధికారులు మాత్రం కార్యాలయాల పన్ను వసూలు చేయడంలో వెనుకబడిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణ పరిధిలో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు ఏకంగా రూ.2,32,41,876 మేర పేరుకు పోయాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణ ప్రజల నుంచి ముక్కుపిండి ఆస్తి పన్ను వసూలు చేసే అధికారులు ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు వసూలు చేయడంలో తాత్సారం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏళ్ల తరబడి ఇలా..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు పన్ను బకాయిలు చెల్లించకుండా పోటీ పడుతున్నాయోమో అనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోస్టాఫీసు 1993-94 నుంచి (31 ఏళ్లు) బకాయి ఉండగా ఎక్స్ఛేంజ్ (బీఎస్ఎన్ఎల్) కార్యాలయం 2004-05 నుంచి పన్నుల బకాయిలు చెల్లించాల్సి ఉంది. పంచాయతీ రాజ్ కార్యాలయం బకాయిలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకన్నా అధికంగా రూ. 42,00,931 ఉన్నాయి. 2004-05 నుంచి దాదాపు 20 ఏళ్లుగా పన్నులు చెల్లించిన దాఖలాలు లేవు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 2006-07 నుంచి, ఏపీ హౌసింగ్ 2004-0 5నుంచి, పీ అండ్ డీ ఫారం 2013-14 నుంచి, తహసీల్దార్ కార్యాలయం 2004-05 నుంచి, ఎంపీడీఓ కార్యాలయం 2017-18 నుంచి, ది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్సీ కార్యాలయం రూ.2006-07 నుంచి, డిప్యూటీ ఈఈ పీఆర్ ఎస్ఏపీ షాపింగ్ కాంప్లెక్స్ 2019-20 నుంచి డిప్యూటీ ఈఈ, ఆర్అండ్‌బీ 2004-05 నుంచి, డిప్యూటీ ఈఈ టీబీపీ 2007-08 నుంచి, పోలీసు కార్యాలయం 2012-13 నుంచి నేటి వరకు పన్ను వసూలు కాలేదు. దాదాపు దాదాపు 30 ఏళ్ల నుంచి పన్నులు చెల్లించకపోవటంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వ కార్యాలయాల పన్నులే పేరుకుపోవటం చర్చగా మారింది. రెండు కోట్ల బకాయిలు మున్సిపాలిటీలో జమ అయితే పట్టణ ప్రజలకు ఎన్నో మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి పన్నులు రాబట్టాల్సిన అవసరం ఉంది.

పన్నులు చెల్లించాలని నోటీసులు పంపాం



పట్టణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి పన్నులు చెల్లించాలని ఆయా కార్యాలయాలకు నోటీసులు పంపాం. అలాగే ఆయా శాఖల అధికారులతో మాట్లాడుతున్నాం. పన్నులు పేరుకు పోకుండా చర్యలు తీసుకుంటున్నాం.
- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు ఇలా..

పోస్టాఫీసు రూ. 34,50,232
సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రూ. 3,97,801
ఏపీ హౌసింగ్ కార్యాలయం రూ. 1,79,131
ఎక్స్ఛేంజ్ ఆఫీసు(బీఎస్ఎన్ఎల్) రూ. 2,58,325
పీడీ అండ్ డీ ఫారం ఆఫీసు రూ. 22,90,536
తహసీల్దార్ కార్యాలయం రూ. 34,98,051
ఎంపీడీఓ కార్యాలయం రూ. 9,61442
పంచాయతీరాజ్ కార్యాలయం రూ. 42,00,931
ది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్సీ (కాంప్లెక్స్) రూ. 18,46,481
డిప్యూటీ ఈఈ పీఆర్ డిపార్ట్ మెంట్, ఎస్ఏపీ షాపింగ్ కాంప్లెక్స్ రూ.2,11,308
డిప్యూటీ ఈఈ, ఆర్అండ్‌బీ కార్యాలయం రూ. 32,73,932
డిప్యూటీ ఈఈ టీబీపీ కార్యాలయం రూ.11,17,583
పోలీసు కార్యాలయం రూ. 15,56,123 లు బకాయిలు ఉన్నాయి.

వణికిస్తున్న పెంగల్ తుఫాన్

- పంట ఎక్కడ చేజారిపోతుందోనని రైతుల ఆందోళన
- దిగుబడిని అమ్ముకోవడానికి అవకాశం లేని దుస్థితి
- టార్పాలిన్లు లేక రైతుల గగ్గోలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు గత మూడు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా విలవిల్లాడిపోతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు చేతికందే దశలో పెంగల్ తుఫాన్ దాపురించింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఏర్పడిన ఈ తుఫాన్ ఎక్కడ తమను ముంచెత్తుతుందోనని కర్నూలు, నంద్యాల జిల్లాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా ఎండ రావడం లేదు. ముసురు అలుముకున్నది. దీంతో పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్లితే తేమ శాతం అధికంగా ఉందని ఎక్కడ కొనరో అని రైతులు ఆవేదన చెందుతున్నారు. 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తిని కొంటామని, అంతకంటే ఎక్కువ ఉంటే వెనక్కి పంపించేస్తామని సీసీఐ అధికారులు గత పది రోజులుగా రైతుల ముఖం మీద చెప్పేస్తున్నారు. ప్రస్తుతం పెంగల్ తుఫాన్ కారణంగా ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు లేకున్నా చెదురుమొదురు వానలు పడుతున్నాయి. ఎండ ఏ మాత్రం లేదు. దీంతో రైతులు పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్లకుండా ఇళ్లలోనే నిల్వ చేసుకోవల్సిన దుస్థితి ఏర్పడింది. అదే విధంగా వరి కోతలు మొదలయ్యాయి. కేసీ కెనాల్ పరిధిలోని నందికొట్కూరు, ఆత్మకూరు, కర్నూలు పరిసర గ్రామాలతో పాటు ఆళ్లగడ్డ వరకు వరికోతలు చురుగ్గా సాగుతున్నాయి. పెంగల్ తుఫాన్ తాకిడికి పొలంలో పెరికిన వరిని గింజలు రాలకుండా చూసుకోవడంలో రైతులు తలకిందులవుతున్నారు. టార్పాలిన్లను రైతులకు అందించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో ప్రైవేటు దుకాణాల్లో కొని పంట దిగుబడులను కాపాడుకునేందుకు ఆగచాట్లు పడుతున్నారు. ఒక ఎకరాల్లో పోసిన వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంట ఉత్పత్తులు వర్షానికి తడవకుండా ఉండాలంటే దాదాపు రూ.1000 దాకా ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు చెబుతున్నారు. ఈ పెంగల్ తుఫాన్ ఎక్కడ తమ కొంప ముంచుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హొళగుంద: మండలంలో వరి కోత మిషన్ల కొరత ఉండడంతో రైతులకు కంటిమీద కునుకు కరువైంది. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా, కాలువ గట్లు, రైస్ మిల్లులకు తరలించి, వరి ధాన్యాన్ని పట్టాలు కప్పి కాపాడుకోవడానికి కష్టాలు పడుతున్నారు.



హొళగుందలో రైస్‌మిల్ వద్ద వరి బస్తాలపై పట్టలు కప్పిన దృశ్యం

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు

- చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం
- ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాదితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

సమైక్య భోజనం..

- నారాయణపురంలో తరతరాల ఆచారం
- గర్జ లింగేశ్వరుడి సన్నిధిలో భోజనం రాశి
- ప్రత్యేక పూజల అనంతరం సహపంక్తి భోజనం
- ఏటా కార్తీక అమావాస్య మరుసటి రోజు ఆచారం

6



జీడీపీ కింద

రబీ సాగుకు సన్నద్ధం..!

- 15 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఐఏబీ తీర్మానం
- నేటి నుంచి కాలువలకు నీటి విడుదల

7





అన్నం రాశిపై బండారు చల్లుతున్న అర్చకులు



గర్జి లింగేశ్వర స్వామి సన్నిధిలో భోజనం ఆరగిస్తున్న ప్రజలు

సమైక్య భోజనం..

- నారాయణపురంలో తరతరాల ఆచారం
- గర్జి లింగేశ్వరుడి సన్నిధిలో భోజనం రాశి
- ప్రత్యేక పూజల అనంతరం సహపంక్తి భోజనం
- ఏటా కార్తీక అమావాస్య మరుసటి రోజు ఆచారం

ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేకువజామునే ఊళ్లోని మహిళలందరూ తలంటు పోసుకొని నిష్ఠతో భోజనం వండారు. ఇంటిల్లిపాదికీ సరిపడా అన్నం చేశారు. ఆ పాత్రలను నేరుగా తీసుకువెళ్లి గర్జి లింగేశ్వరుడి ఆలయం సన్నిధిలో రాశి పోశారు. గ్రామంలోని అందరూ ఇలా చేశాక గ్రామ పెద్దలు, పూజారులు ఆ భోజనం రాశికి పూజలు నిర్వహించి, పసుపు బండారు జల్లారు. కులం లేదు..మతం లేదు..వయో భేదం లేదు... అందరూ ఆలయం ఎదుట వరుసగా కూర్చొని ఆరగించారు. ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం అబ్బురపరిచే ఈ సమైక్య భోజనాలు నిర్వహించారు. ఈ గ్రామంలో తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. గ్రామంలోని గర్జి లింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం తరువాత వచ్చే అమావాస్య మరుసటి రోజున స్వామి సన్నిధిలో ఊరుమ్మడి భోజనం రాశి ఏర్పాటు చేసి పూజించి, అనంతరం సహపంక్తి భోజనాలు చేయడంఈ ఊరి సంప్రదాయం. ఈ సంప్రదాయం తమ గ్రామాన్ని ఐక్యంగా ఉంచుతోందని ఊరి పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దేవాలయం సన్నిధిలో సహపంక్తి భోజనం చేస్తున్న గ్రామస్థులు



తరతరాల పద్ధతి

తరతరాలుగా ఈ సంప్రదాయం మా ఊళ్లో కొనసాగుతోంది. కులమతాలకు అతీతంగా, ఊరందరం కలిసి దైవ సన్నిధిలో సహపంక్తి భోజన చేస్తాం. ఇలా చేస్తే ఊరికి మంచి జరుగుతుందని మా పెద్దలు చెప్పారు.

-లింగారెడ్డి



మంచి జరుగతుందని..

గ్రామంలోని ప్రతి ఇంట్లో రోజు తినే భోజనాన్ని తయారు చేసి గర్జ లింగేశ్వర స్వామి సన్నిధిలో ఉంచుతాం. స్వామి సన్నిధిలోనే భోజనం చేస్తే మంచి జరుగుతుందని మా నమ్మకం.

-అయ్యప్పరెడ్డి



కరువు దరిచేరదు

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వస్తున్న ఆచారం. కార్తీక పూజల అనంతరం పెద్ద పండుగలా ఈ వేడుకను చేసుకుంటాం. కుల మతాలకు అతీతంగా ఒక చోటకు చేరి అన్నం తినడం సంప్రదాయంగా వస్తోంది. ఇలాచేస్తే కరువు దరిచేరదని మా నమ్మకం.

-రామచంద్రారెడ్డి



గర్జి లింగేశ్వర స్వామి సన్నిధిలో భోజన రాశి



కుల మతాలకతీతంగా..

కుల మతాలకు అతీతంగా గ్రామంలోని అన్ని కుటుంబాలవారు ఒకే చోట చేరి సహపంక్తి భోజనం చేస్తాం. అలా చేస్తే మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని నమ్మకం. ఈ ఆచారం పెద్దల కాలం నాటి నుంచి వస్తుంది. మేము కూడా అలానే పాటిస్తున్నాం.

- శేఖర్, మాజీ ఎంపీటీసీ

కాయితాల మీదే ఇంటింటికి బియ్యం

(5వ పేజీ తరువాయి)



కర్నూలు నగరం ఓల్డ్‌టౌన్, కొత్తపేట, లేబర్ కాలనీ, బుధవార పేట.. తదితర కాలనీలో ఎండీయూ వాహనాలు ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నారా..? అని పరిశీలిస్తే.. ఇక్కడ బియ్యం అక్రమ కొనుగోలు భాగోతం వెలుగు చూసింది. కార్డుదారులు వేలి ముద్రలు (తంబ్) వేయించుకుంటారు. బియ్యం కావాలా..? డబ్బులు కావాలా..? అని అడుగుతారు. కార్డుదారులు డబ్బులు కావాలంటే కిలో రూ.10 ప్రకారం లెక్కకట్టి ఇస్తున్నాడు. ఐదుగురు సభ్యులు ఉన్న కార్డుదారుడు బియ్యం వద్దంటే 25 కిలోలకు రూ.250 ఇస్తున్నారు. ఎండీయూ వాహనాలు బియ్యం అక్రమ రవాణాకు అడ్డాగా మారాయి. కార్డుదారుడితో కిలో రూ.10కు కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలో రూ.14-16కు మాఫియాకు విక్రయిస్తున్నట్లు సమాచారం. సగం కార్డుదారులు ఎండీయూ వాహనాల ఆపరేటర్లకే బియ్యం ఇచ్చేసి డబ్బులు తీసుకుంటున్నారని తెలుస్తున్నది. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని సమాచారం. పేదలకు ఆకలి తీర్చి 'ఆహార భద్రత' కల్పించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిలో రూ.40.50 ఖర్చు చేస్తున్నది. కార్డుదారుల నుంచి కేవలం రూ.10కు ప్రకారం సేకరించి రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఆలూరు మండలంలో 10 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ప్రతి నెల ఒకటో తారీఖు నుంచి 15వ తేది వరకు ఇంటింటికి వెళ్లి కార్డుదారులకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు బియ్యం పంపిణీ చేయాలి. ఒక్కో వాహనానికి రూ.26,500 ప్రభుత్వం ఇస్తుంది. ఏడాదిగా ఈ వాహనాలు రోడ్డెక్కలేదనే విషయం నా దృష్టికి రాలేదు. విచారించి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

- గోవిందుసింగ్, తహసీల్దార్, ఆలూరు

తక్షణ చర్యలు తీసుకుంటాం

తహసీల్దార్లు ఇచ్చే రిపోర్టు ఆధారంగానే ఎండీయూ వాహనాల ఆపరేటర్లకు జీతాలు ఇస్తున్నాం. బియ్యం పంపిణీ చేయకుండానే జీతాలు తీసుకుంటున్న దానిపై విచారణ చేయిస్తాను. నిజమని తేలితే చర్యలు తప్పవు. ఎండీయూ వాహనాల ఆపరేటర్లు కొందరు వాహనాల వద్దే బియ్యానికి బదులుగా కిలోకు రూ.10 లెక్క కట్టి డబ్బులు ఇవ్వడం నేరం అవుతుంది. ఆకస్మిక తనిఖీలు చేస్తాం. మా తనిఖీల్లో తెలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- రఘువీర్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు, కర్నూలు

పెట్టుబడిదారుల ఊడిగంలో ప్రభుత్వాలు

- కర్నూలులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గపూర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గపూర్

కల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. సోమవారం చెన్నమ్మ సర్కిల్ కూడలిలో నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీపీఎం 3వ బహిరంగసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలను కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు మద్దతుగా మారి ప్రజలపై భారీగా భారాలు వేస్తున్నారని విమర్శించారు. ప్రజల కంటే కార్పోరేట్లకు మేలు చేయడానికి ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేయడానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. రైతులు దివాలా తీస్తున్నారని, గిట్టుబాటు ధరల కోసం ఢిల్లీలో రైతులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. 2014లో సీఎం చంద్రబాబు గెలిచినపుడు జిల్లా సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తానని చెప్పి 10 ఏళ్లు గడచినా గంపెడు మట్టి వేయలేదని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మిరప రైతును ఆదుకోండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే గౌరు చరిత



కలెక్టర్‌తో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిరప రైతు నాగయ్యను ఆదుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత కలెక్టర్‌ను కోరారు. కల్లూరు మండలం కొంగనపాడు గ్రామానికి చెందిన రైతు నాగయ్య 13 ఎకరాల్లో వేసిన మిరప పంట కుప్పలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, దీంతో దాదాపు రూ.30 లక్షలు నష్టం వచ్చిందని, ఆ రైతును ఆదుకోవాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వే నెం.166, 125/4లోని 13 ఎకరాల్లో మిర్చి పంట రైతు నాగయ్య పండించాడన్నారు. కల్లంలోని మిరప పంటను నాలుగు కుప్పలుగా ఎండబెట్టగా.. ఈ ఏడాది జనవరి 17న రాత్రి 7.30 గంటలకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మిరప నిప్పు పెట్టారని తెలిపారు. దాదాపు 150 క్వింటాళ్ల మిరప పంట కాలిపోయిందని చెప్పారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా పరిహారం మంజూరు చేయాలని కోరారు. అలాగే ఓర్వకల్లు మండలం భైరాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులుకు పాస్ పుస్తకాలు ఉన్నా సంబంధిత భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, అలాగే కల్లూరు మండలం ఎ.గోకులపాడు పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్య ఉందని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాగన్న, భైరాపురం రైతులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024కు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్. పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 12లోపు Www.apced-mmwd.org వెబ్‌సైట్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఏఐవైసీ వ్యవహారాల ఇన్‌చార్జి రాక

కర్నూలు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి నగరానికి రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

నివేదికలు సిద్ధం చేయండి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): ఈనెల 10,11 తేదీలలో నిర్వహించే ముఖ్య మంత్రి సమావేశానికి సంక్షిప్త నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ స్పెషల్ అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేసి పారిశుధ్య కార్యక్రమాలపై మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ భవనంలో టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 139 ఇంటర్మీడియట్ కాలేజీల్లో 5,861 మంది విద్యార్థుల్లో 2,252 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారని తక్కువ శాతంతో పాస్ కావడానికి గల కారణాలేంటని డీవీఐఓను కలెక్టర్ ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు కాలేజీ ప్రిన్సిపాళ్లందరితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డీఆర్‌ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ అభివృద్ధికి సభ్యత్వాల సమోదు

జిల్లాలో ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొంది రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషిచేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో జనవరి 2025 నాటికి ప్రతినియోజకవర్గంలో 1000కిపైగా సభ్యత్వాలు నమోదు అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. తద్వారా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్‌స్టోరేజ్ సెంటర్, డిజాస్టర్-ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కేంద్రం, రెడ్‌క్రాస్ కార్యాలయం ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో ప్రజలకు రెడ్‌క్రాస్ సేవలు అందేలా కృషి చేద్దామని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ దస్తగిరి పర్ల, రెడ్‌క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురూజీ సభ్యుడు ఉస్మాన్‌భాష తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకంపై అవగాహన కల్పించాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో పంటల బీమా పథకం 2024-25 పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఎఫ్‌బీవై కింద శనగలు, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు ఈనెల 15లోపు, వరి పంటకు ఈనెల 31లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు ఎకరాకు శనగ రూ.420, జొన్న రూ.297, వేరుశనగ రూ.480, ఉల్లిగడ్డ రూ.1350, వరి పంటకు ఎకరాకు రూ.630 బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. రుణం తీసుకోని రైతులు ఆధార్ కార్డు, పొలానికి సంబంధించిన పత్రాలు, ఫోన్ నెంబర్, బ్యాంక్ పాసుబుక్ మొదటి పేజీలు సమర్పించి బీమా చేసుకోవా లన్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసు కున్న రైతులకు తీసుకున్న రుణంలోనే ప్రీమియం మినహాయించుకుని రుణం ఇస్తారని, ఆ రైతులు బీమా చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. వివరాల కోసం టోల్‌ఫ్రీ నెం.1800-209-3536, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ క్లస్టర్ మేనేజర్ 9059634144లను సంప్రదించాలన్నారు. జేసీ డా.బి. నవ్య, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వలంటీర్లు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 2.6 లక్షల మంది గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. వలంటీర్లను విధుల్లో తీసుకోవాలని కోరుతూ సోమవారం రాజవిహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. నగేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనం ఇవ్వడంతో పాటు వెంటనే విధుల్లోకి తీసుకుని బకాయి జీతాలు విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి, యువజన సంఘాలు గ్రామ, వార్డు వలంటీర్లకు మద్దతుగా నిలవాల్సి వస్తుందని హెచ్చరించారు. వలంటీర్ల పోరాటానికి డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు అంజి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, సాయిఉదయ్ పాల్గొన్నారు.

కుక్కల దాడులపై వినూత్న చిత్రం



కోటేష్ ప్రతిభకు నిదర్శనం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ వినూత్నంగా చిత్రం వేసి మంచి సందేశాన్ని ఇచ్చారు. ఎ3 డ్రాయింగ్ షీట్ మీద ఒలికిన కాఫీతో వీధి కుక్కల దాడుల దృశ్యం కనిపించేలా చిత్రం వేశారు. మైక్రో బ్రష్ ద్వారా ఆయన చిత్రం వేశారు. తెలుగు రాష్ట్రాల్లో వీధి కుక్కలు ప్రజల మీద దారుణంగా దాడి చేస్తున్నాయి. వీటిని కళ్లకు కట్టినట్టుగా చిత్రకారుడు కోటేష్ చిత్రీకరించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు.



కుక్కల దాడి సంఘటనపై చిత్రం

రబీ సాగుకు సన్నద్ధం!

- జీడీపీ కింద 15 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని ఐఏబీ తీర్మానం
- నేటి నుంచి కాలువలకు నీటి విడుదల
- సన్నాహాలు చేస్తున్న ఇంజనీర్లు
- గేట్ల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టిన ఇంజనీర్లు



గాజులదిన్నె ప్రాజెక్టు

కర్నూలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు కింద రబీ సాగుకు రైతులు, ఇంజనీర్లు సన్నద్ధం అవుతున్నారు. రబీ సీజన్‌లో 15 వేల ఎకరాకలకు సాగునీరు ఇవ్వాలని ఐఏబీ సమావేశంలో తీర్మానించారు. గతేడాది తాగునీటి అవసరాలు దృష్ట్యా సాగునీరు ఇవ్వకపోవడం వల్ల రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఈ ఏడాది తప్పకుండా రైతులకు సాగునీరు ఇవ్వాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టుబట్టారు. ఆ దిశగా ఇంజినర్లు కూడా సాగు ప్రణాళికలను సిద్ధం చేశారు. మంగళవారం పంట కాలువలకు ఎమ్మెల్యే బీవీ సాగునీరు విడుదల చేసారని ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్ ఆంధ్రజ్యోతికి వివరించారు. అదే క్రమంలో గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు కాక ఆగిపోయిన ఆనకట్ట ఎత్తు పెంచడం, నూతన క్రస్‌గేట్లు ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీడీపీ జలాశయం ద్వారా గోనెగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ మండలాల్లో 21 గ్రామాలకు రబీ సీజన్‌లో 25,454 ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. డోన్, కృష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాల ద్వారా డోన్ పట్టణం సహా వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా.. సోమవారం నీటి లెక్కలు కొలిచే సమయానికి 2.79 టీఎంసీల నిల్వ ఉంది. 40 క్యూసెక్కులు హంద్రీనీవా కాలువ నుంచి వచ్చి చేరుతోంది. డెడ్ స్టోరేజీ పోను 2.14 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం (లైవ్ స్టోరేజీ) ఉంది. నవంబరు 26న కలెక్టరు పి.రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగిన రబీ ఐఏబీ సమావేశంలో 15 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. సాగు కోసం 1.50 టీఎంసీలు అవసరం ఉంది. అయితే.. నీటి లభ్యత దృష్ట్యా 12-13 వేల ఎకరాలకు తగ్గకుండా సాగు నీరు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మంగళవారం ఎమ్మిగ నూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నారు. గతేడాది తాగునీటి అవస రాల దృష్ట్యా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. ప్రస్తుతం ఆ పరిస్థితి తలెత్త కుండా ముందస్తు ప్రణాళికతో సాగునీరు ఇచ్చేలా సన్నాహాలు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీ నీవా నీటిని తీసుకుంటేనే..

జీడీపీ ద్వారా సాగు, తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలంటే హంద్రీనీవా కాలువ, తుంగభద్ర దిగువ కాలువ నుంచి జీడీపీకి నీటిని తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి ద్వారా 12-13 వేల ఎకరాలకు సాగునీరు, ఆయా గ్రామాలకు తాగునీరు ఏప్రిల్ వరకు ఎలాంటి సమస్య తలెత్తకుండా ఇవ్వవచ్చు. మే, జూన్ నెలల్లో నీటి సమస్యను అధిగమించాలంటే హంద్రీనీవా కాలువ ద్వారా రోజుకు 300 క్యూసెక్కులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తాజాగా వంద క్యూసెక్కులు విడుదల చేస్తే జీడీపీకి 40 క్యూసెక్కులు చేరుతున్నాయి. చిత్తూరు జిల్లా కుప్పంకు కృష్ణా జలాలు తీసుకెళ్లాలనే లక్ష్యంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటి విడుదలను ఆపేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే బీవీ జోక్యం చేసుకొని హంద్రీనీవా ఇంజనీర్లతో మాట్లాడి 300 క్యూస్కెలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఎల్లెల్సీ పరిధిలో వరి కోతలు ఉన్నాయి. ఎల్లెల్సీ నీటిని కూడా జీడీపీకి మళ్లించి నిల్వ చేస్తే మే, జూన్ నెలల్లో కూడా సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేయవచ్చు.

క్రస్ట్‌గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభం

ఆగిపోయిన క్రస్ట్‌గేట్ల ఏర్పాటు పనులకు ఎట్టకేల కు శ్రీకారం చుట్టారు. జీడీపీ సామర్థ్యం 4.50 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీల సామర్థ్యం పెంపు, తప్పు పట్టి పాడైపోయిన క్రస్ట్‌గేట్లు స్థానంలో నూతన క్రస్ట్‌గేట్లు ఏర్పాటు పనులు వైసీపీ ప్రభుత్వ హ యాంలో చేపట్టారు. రూ.35 కోట్లతో ఆనకట్టు ఎత్తు పెంచే పనులు, రూ.12 కోట్లతో కొత్త క్రస్ట్‌గేట్లు ఏర్పాటు పనులు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వక పోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అసంపూర్తి పనులపై ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఎమ్మెల్యే బీవీ జీడీపీ ఇంజనీర్లు, కాంట్రాక్టరుతో చర్చించి ఆగస్టులోనే కొత్తగా నాలుగు గేట్లు ఏర్పాటు చేశారు. మరో రెండు గేట్లు ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతు న్నాయి. కాంట్రాక్టర్‌కు బకాయి బిల్లులు చెల్లించి అసంపూర్తి పనులు పూర్తి చేయించి ఆయకట్టుకు సాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



జీడీపీ కుడి కాలువ



క్రస్ట్ గేట్ల పనులు

15 వేల ఎకరాలకు నీరివ్వాలని నిర్ణయం

జీడీపీ కింద రబీలో 15 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఐఏబీలో నిర్ణయం తీసుకున్నారు. పంట కాలువలకు నేడు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చేత విడుదల చేయించేందుకు ఏర్పాట్లు చేశాం. రైతులకు సాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఆరు క్రస్ట్‌గేట్లలో నాలుగు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం. మరో రెండు గేట్లు ఏర్పాటు పనులు మొదలు పెట్టాం.

- శైలేశ్వర్, ఈఈ, టీబీపీ ఎల్లెల్సీ డివిజన్, ఆదోని

విద్యార్థి ఆత్మహత్య

వెల్దుర్తి/వెల్దుర్తి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిధిలోని ఎల్. నగరం గ్రామానికి చెందిన ఎల్లకృష్ణ (12) అనే విద్యార్థి తల్లిదండ్రులు మందలించారని పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తెలుగు మట్టి శేఖర్ కుమారుడు ఎల్లకృష్ణ వెల్దుర్తిలోని పద్మ వికాస్ కాన్వెంట్‌లో చదువుకుంటున్నారు. ఐదురోజుల నుంచి పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండటంతో ఉదయం తల్లిదండ్రులు మందలించి పొలానికి వెళ్లారు. ఇంట్లో పురుగు మందు తాగడు. కుటుంబ సభ్యులు వెల్దుర్తి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి 108లో కర్నూలుకు తరలిస్తుండగా.. మృతి చెందాడు.

రైలు ఢీకొని..

నంద్యాల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని బొమ్మలసత్రం సమీపంలో రైలు ఢీకొని విద్యార్థి సోమవారం మృతి చెందాడు. ఈ ఘటన జరిగింది. డోన్‌కు చెందిన సతీష్ బొమ్మలసత్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం ఉదయం బహిర్భూమికి సమీపంలోని రైల్వేట్రాక్ మీద నడుచుకుంటూ వెళ్తుండగా సతీష్‌ను రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాల మార్చురీ గదికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా విద్యార్థి మృతి పట్ల రాయలసీమ విద్యార్థి జేఏసీ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. హాస్టలో నీటి వసతి, టాయిలెట్లు, బాత్‌రూములు సరిగా లేనందునే విద్యార్థి బహిర్భూమికి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ సమస్యలను పలుమార్లు అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు.



సతీష్ (ఫైల్)

టికెట్ల గోల్‌మాల్‌పై విచారణ



విచారణ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరీదేవి

మహానంది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహానందిం ఆలయంలో గత నెల 17 వ తేదిన జరిగిన సేవా దర్శనం టికెట్ల విక్రయం గోల్‌మాల్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరీదేవి ఆలయ అధికారులను విచారించారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆలయ ఏఈవో మధుతో పాటు సిబ్బందిని ఎస్పీ విడివిడిగా సేవా దర్శనం టికెట్ల విక్రయాలతో పాటు ఆలయంలో జరిగే అవినీతి అక్రమాల ఆరోపణలపై విచారించారు. అలాగే దేవస్థానంలో వివిధ విభాగాల రికార్డులను కూడా పరిశీలించారు. అయితే ఎస్పీ విచారణ సమయంలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి అందుబాటులో లేక పోవడంతో విచారణ పూర్తి కాలేదని ఎస్పీ చెప్పారు. మరోసారి మహానందిలో ఆలయ అధికారులతో విచారించిన తర్వాత నివేదికలను ఉన్నత స్థాయి అధికారులకు పంపుతామని తెలిపారు. అనంతరం మహానంది ఆలయంలో విజిలెన్స్ ఎస్పీ స్వామి, అమ్మవార్లను దర్శించుకొన్నారు. వీరి వెంట విజిలెన్స్ డీఈ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో దొంగతనం



ఎరువుల దొంగతనం జరిగిన గోడౌన్

ఆదోని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పెద్దహరివాణం రైతుభరోసా కేంద్రంలో దొంగలు పడ్డారు. రైతులకు సబ్సిడీ కింద పంపిణీ చేసే యూరియా ఎరువు సంచులను ఎత్తుకెళ్లారు. గ్రామంలోని ఏపీజీబీ బ్యాంకు పక్కన గోడౌన్‌లో వ్యవసాయ అధికారులు ఎరువుల సంచులను ఉంచారు. నవంబరు 26వ తేదీన గోడౌన్ తలుపులు పగిలిపోయి కనిపించడంతో వాచ్‌మెన్ ఆదెప్ప బ్యాంకు మేనేజర్ బాలకృష్ణకు సమాచారం ఇచ్చారు. మేనేజర్ ఏఈవో సమాధానమ్మకు తెలియజేశారు. ఏఈవో మహిళా పోలీసు సహకారంతో గోడౌన్ తెరిచి చూడగా, 59 యూరియా బ్యాగులతోపాటు రికార్డులను ఎత్తుకెళ్ళినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఇస్వీ పోలీసులకు ఏఈవో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

రూ.1.52 కోట్లకు ఐపీ

రుద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో మొక్కజొన్నల వ్యాపారి రూ.1.52,95,000కు ఐపీ పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో రైతుల నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేసి కనిపించకుండా ఐపీ నోటీసులు మంజూరు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 87 మంది రైతులకు నోటీసులు అందాయని సమాచారం. రుద్రవరంతోపాటు కొండమాయపల్లె, అప్పనపల్లె గ్రామాల్లో మొక్కజొన్నలు కొనుగోలు చేశారు. ఎస్ఐ వర్రప్రసాద్‌ను వివరణ కోరగా నవంబరులో రైతుల ఫిర్యాదు మేరకు మొక్కజొన్నల వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం నోటీసులు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

కోడుమూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు-ప్యాలకుర్తి గ్రామాల మధ్యన ఆదివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారు దగ్ధమయ్యింది. కర్ణాటకలోని ధార్వాడకు చెందిన నాగరాజు, శివానంద కుటుంబంతో కలిసి శ్రీశైలం వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో కొత్తూరు దాటిన తర్వాత కారు ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. దీంతో ఆందోళన చెంది భార్యాపిల్లలతో కలిసి కిందకు దిగారు. కొద్దిక్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. దీంతో దూరంగా పరుగుతీసి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కారు పూర్తిగా కాలిపోయింది.

సృజనాత్మక విద్యకే వర్చువల్ క్లాసులు



మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సృజనాత్మక విద్య అందించేందుకే రాష్ట్రంలోప్రథమంగా కర్నూలు జిల్లాలో వర్చువల్ క్లాసులకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారని, డీఈవో శ్యామూల్ పాల్ తెలిపారు. సోమవారం జడ్పీ ప్రాంగణంలోని జడ్పీ హాలులో కర్నూలు డివిజన్ హెచ్‌ఎంల సమావేశాన్ని నిర్వహించారు. అపార్, టీఎన్‌ఏ సర్వేలోనూ అశ్రద్ధ చేయరాదని సూచించారు. పేరెంట్స్ మెగా మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఇప్పటి నుంచే చేపట్టాల్సిన సూచనలు చేశారు. కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 90 అర్జీలు

నంద్యాల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 90 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. సివిల్ తగాదాలు, కుటుంబకలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్ధలు తదితరాలపై ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్‌బాబు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

వాగులో పడ్డ కారు

పాణ్యం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలోని అడ్డవాగులో సోమవారం తెల్లవారుజామున కారు పడిన నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. అరుణాచలం నుంచి హైదరాబాదుకు వెళ్తున్న విజయవాడకు చెందిన కారు తెల్లవారుజామున అడ్డవాగులో పడినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. హైవే రహదారి వంతెన ఇరుకుగా ఉండడం వల్లే ఈ ప్రమాదమేర్పడిందని బాధితులు పేర్కొన్నారు. విజయవాడకు చెందిన పద్మనాభం, శ్రీదేవి, దీప్తి, జయశేఖర్‌లు గాయాలపాలయ్యారు. వీరిని హుటాహుటిన శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన పది గంటల ముందే ఇక్కడే ఆటో వంతెనను ఢీకొని నలుగురు నంద్యాల వాసులు గాయాలపాలైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- పరిశీలించిన డీఎస్పీ బాబుప్రసాద్

కోడుమూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరు పొలిమేరలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వేప చెట్టుకు ఉరి వేసుకొని కనిపించినా అది హత్యే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చనుగొండ్ల గ్రామానికి చెందిన ఉప్పరి శ్రీరాములు, రామేశ్వరి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి చిన్నకుమారుడు శివ (26) ఇంటికి సమీపంలో పంక్చర్ షాపు నిర్వహిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. శివ అవివాహితుడు కావడంతో రోజూ రాత్రి పూట పంక్చర్ షెడ్‌లో నిద్రించేవాడు. అయితే ఆదివారం అమావాస్య కావడంతో తల్లి రామేశ్వరి దేవుని దర్శనం కోసం వెళ్లింది. తండ్రి శ్రీరాములు కోళ్ల ఫారంలో పనికి కుదరడంతో అక్కడికి వెళ్లాడు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తున్న కొందరు షెడ్ పక్కన బైక్ ధ్వంసమైనట్లు గుర్తించారు. షెడ్‌లో శివ లేకపోవడం, గ్రీజ్ మిషన్, హోమ్ థియేటర్ ధ్వంసం కావడం, ఇతర సామగ్రి చిందరవందరగా పడి ఉండడం గమనించారు. దీంతో శివ సోదరులను నిద్రలేపి గూడూరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు శివ మొబైల్ లోకేషన్ ట్రాక్ చేసి అందరూ కలిసి వెతికారు. చివరకు గ్రామానికి సుమారు 6 కి.మీ దూరంలో జీడీపీ కెనాల్ పక్కన ఓ పొలంలో వేప చెట్టుకు ఉరికి వేలాడు తున్న శివ మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలిసి డీఎస్పీ బాబుప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. డాగ్, క్లూస్ టీంలను రంగంలోకి దింపారు. ఘటనాస్థలిలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నం టాయి. తమ కుమారుడిని హత్యచేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ఉరివేశారని తల్లిదండ్రులు, సోదరులు ఆరోపించారు. సీఐ తబ్రేజ్, ఎస్ఐలు శ్రీనివాసులు, తిమ్మయ్య అధ్వర్యంలో మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.ట



రోదిస్తున్న మృతుడి సోదరి, ఇన్‌సెట్‌లో ఉప్పరి శివ (ఫైల్)

అత్యాశకు పోవొద్దు..

- క్రిప్టో కరెన్సీ కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు



వివరాలు వెల్లడిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అధిక డబ్బు వస్తుందన్న అత్యాశకు వెళ్లి మొదటికి మోసం తెచ్చుకోవద్దని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పట్టణంలోని సీఐ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిప్టో కరెన్సీ కేసులో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణం కొత్తపేటలో నివాసముంటున్న రామాంజనేయులు 2021 నవంబరు నుంచి ఒక ఆయుర్వేదిక్ షాపులో పని చేస్తూ.. అదే ప్రాంగణంలో సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ప్రజలకు రూ.లక్ష పెట్టుబడి చేస్తే.. ప్రతి నెలా రూ.10వేలు అందిస్తానని ఆశ చూపాడు. క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ద్వారా లాభాలు వస్తాయని నమ్మించి డోన్ పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 315 మంది నుంచి రూ.23 కోట్ల అక్రమ డిపాజిట్ల రూపంలో సేకరించాడు. వాటిని విడతల వారిగా వడ్డీ రూపంలో వారికే సుమారు రూ.17 కోట్లు చెల్లించాడు. ప్రారంభంలో డిపాజిటర్లకు వడ్డీ చెల్లిస్తూ నమ్మించి మోసం చేస్తూ అధిక డిపాజిట్లు పొందాడు. సెప్టెంబరు నుంచి వడ్డీ చెల్లించడం నిలిపివేవాడు. ఈ మేరకు నిందితుడు రామాంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేసి సాక్షులను విచారించారు. నిందితుడు బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.2.45 కోట్లను ఫ్రీజ్ చేశారు. సోమవారం తమ పోలీసు ప్రత్యేక బృందం రామాంజనేయులును అరెస్టు చేసి మోటారు సైకిల్, సెల్‌ఫోన్‌ను కేసుకు సంబంధించిన ఇతర ముఖ్యపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ నరేంద్ర కుమార్, శరత్ కుమార్ రెడ్డి, రూరల్ ఎస్ఐ మమత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఓర్వకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి అధి కారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలకు ఆమె హాజర య్యారు. ట్రైనీ కలెక్టర్ తోపాటు తహసీల్దార్ విద్యాసాగర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీ డీవో శ్రీనివాసులు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో ఆర్డీ సుబ్బరాయుడు, ఇంజనీర్లు శ్రీనివాసులు, రామయ్య, సురేంద్ర నాథ్, ఏపీఎం వెంకట్రామిరెడ్డి, ఏపీవో కుమారసాయినాథ్, సర్వే యర్ శంకర్ మాణిక్యం, వీఆర్వోలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ: నగర శివారు లోని జగన్నాథగుట్ట వద్ద ఏర్పాటు చేసిన టిడ్కో ఇళ్లను కేటాయిం చాలని పలువురు లబ్ధిదారులు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ రవీంద్రబాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో రూ.50వేలు చెల్లించామని అనివార్య కారాణాలతో ఇళ్లు తీసుకోవ డంలో కాలయాపన జరిగిందని కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమానికి 16 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో డబ్బులు కట్టి మళ్లి ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సిద్ధం చేయాల న్నారు. నగర శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమి షనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ శేషసాయి, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

● బుధవారపేట శివాలయం పక్కనే నూతన కల్వర్టు, రోడ్డు నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ కమిషనర్‌ను కోరారు. 15వ వార్డులో ఇరవై ఏళ్ల క్రితం వేసిన కల్వర్టు రోడ్డు కంటే ఎత్తు తక్కువ ఉండటంతో మురుగునీరంతా బ్లాక్ అయి బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో మణి, జయ చంద్ర, అశోక్, రాజేష్ పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్మికులకు పీడీ ఖాతాలను ప్రారంభించేందుకు కార్మికుల వివరాలను ఖజానా శాఖ కార్యాలయానికి పంపాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో జీపీఎఫ్ ఖాతాలు లేకపోవడంతో కార్మికులు వేలాది రూపాయలు డీఏ బకాయిలు నష్టపోయారన్నారు.

రేషన్ డీలర్లను తొలగించొద్దు

కర్నూలు కలెక్టరేట్: మార్కాపురం, తడకనపల్లె గ్రామాల్లో చౌక దుకాణాలు నిర్వహిస్తున్న వారిని తొలగించొద్దని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏఐవైఎఫ్ సంఘం నాయకులు కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు మాట్లాడుతూ కలెక్టరేట్ వద్ద డయోగ్నస్టిక్ సెంటర్లు ఎలాంటి అను మతులు లేకుండానే ఏర్పాటు చేసుకొని వైద్య పరీక్షలు నిర్వహిస్తు న్నాయని, వీటిపైన గతంలో అనేకసార్లు వైద్యఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చంటి, నాగేశ్వరరావు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, శివాజీ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అండ్ నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎన్‌ఎం, ఏఎన్ఎం సీట్లను నగరంలోని కొన్ని నర్సింగ్ కళాశాలలు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, విద్యార్థులతో ప్రభుత్వ ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తుస్తున్నారని ఆరోపించారు.

గూడూరు: ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాయలంలో వీఆర్వోలతో తహసీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. అలాగే రీ సర్వే గ్రామ సభల్లో 205 అర్జీలు వచ్చాయన్నారు.



ఓర్వకల్లులో వినతులు స్వీకరిస్తున్న ట్రైనీ కలెక్టర్





కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, వినతులు స్వీకరిస్తున్న కమిషనర్, గూడూరులో మాట్లాడుతున్న తహసీల్దార్

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శాంతినగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక కార్యాలయం ఎదుట కాలనీ వాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ ఎస్. రవీంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ కాలనీలో రెండేళ్ల క్రితం మురుగు కాలు వలు నిర్మించాలని రూ.65 లక్షల ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయన్నారు. కొందరు ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లే నిధులు మరుగు నపడే అవకాశము ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయ కులు మల్లికార్జున, ఇద్రూస్‌బాషా, జైతున్‌బీ, నాగరాజు, కాలనీవాసులు రాఘవేంద్రనాయక్, లక్ష్మి, మస్తాన్ పాల్గొన్నారు.

గుర్రపుశాల అంకయ్యకు పురస్కారం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన పౌరాణిక పద్యనాటక నటుడు గుర్రపుశాల అంకయ్య రంగస్థల నటుడు దివంగత షణ్ముఖి ఆంజనేయరాజు కళాపీఠం అందుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని షణ్ముఖి ఆంజనేయరాజు కళాపీఠం ఏటా నాటక రంగంలో విశేష కృషి చేస్తున్న వారికి రాష్ట్ర స్థాయి కళాపీఠం పురస్కారం అందజేస్తోంది. కాగా ఈ ఏడాదికి గాను సీనియర్ నటుడు గుర్రపుశాల అంక య్యను ఎంపిక చేసి తణుకులో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో అందజేశారు. గుర్రపుశాల అంకయ్య పోలీసు శాఖలో ఎస్‌గా పని చేస్తూ 2008లో పదవీ విరమణ చేశారు. ఆయన గత 40 ఏళ్లుగా పౌరాణిక పద్య నాటకాల్లో తనదైన గళంలో రాణిస్తున్నారు. కార్యక్రమంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ, కోస్టల్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండీ చిలుకూరి రామకృష్ణ, గురజాడ విద్యాసంస్థల అధినేత పాతూరి సీతారామయ్య చౌదరి, ఏపీ నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల రామారావు, నిమ్మగడ్డ హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ అచ్యుత రామయ్య, షణ్ముఖి కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు రసరాజు, విజయ షణ్ముఖి పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న గుర్రపుశాల అంకయ్య

అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించండి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలని చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ సీఎంవో కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ ఆడిట్ శిక్షణ కార్యక్రమాన్ని చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఆర్ఎస్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలకు ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ ఆడిట్‌ను పొరపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా అధికారులను సూచించారు. ఆడిట్ పనులను కంప్యూటర్ ఆపరేటర్లతో కాకుండా సంబంధిత శాఖలు హెచ్‌వోడీలతో చేయించాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారిని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లోశాఖల వారిగా ఏ సబ్జెక్టు మీద ఎక్కువ అర్జీలు వస్తున్నాయి. ఏ ప్రాంతం నుంచి వస్తున్నాయి.. అనే వాటిని కోంటర్ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి దీప్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ఉప లోకాయుక్త చొరవతో కదిలిన జిల్లా యంత్రాంగం

కర్నూలు లీగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప లోకాయుక్త ఇచ్చిన నోటీసులతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పలు చర్యలు తీసుకున్నట్లు పోలీసు, మున్సిపల్ అధికారులు రాష్ట్ర ఉప లోకాయుక్తకు తెలియజేశారు. కర్నూలు నగరంలోని మునగాలపాడు నుంచి వెంగన్నబావి వరకు హైవేను ఆనుకుని వున్న సర్వీసు రోడ్లను పలు వ్యాపార సంస్థలు ఆక్రమించుకుని ట్రాఫిక్‌ను తీవ్రంగా ఆటంకం పరుస్తున్నట్లు గత ఏడాది నవంబరు 8న పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీంతో ఈ వార్తను రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజిని సుమోటాగా స్వీకరించి ఎస్పీ, మున్సిపల్ కమిష నర్, కర్నూలు డీఎస్పీ, నేషనల్ హైవే అధికారులకు గతంలో నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా పోలీసు మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్నామని, ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్లు వారు ఉప లోకాయుక్తకు తెలియజేశారు. దీంతో ఫిర్యాదును ముగిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి చౌరస్తా వద్ద లారీ ఢీకొని మానవపాడు చెందిన నారాయణచారి (53) మృతి చెందారు. తెలంగాణ రాష్ట్రం మానవపాడు గ్రామానికి చెందిన నారాయణచారి వృత్తిగా కార్పెంటర్‌గా పని చేస్తుంటారు. సోమవారం కార్పెంటర్ సామగ్రి కొనుగోలు కోసం కర్నూలు బళ్లారి చౌరస్తాకు వచ్చారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణచారి అక్కడక్కడే మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నారాయణచారి కుమారుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవితంలో కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని లయన్స్ క్లబ్, నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఎస్వీ సుబ్బారెడ్డి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహిం చారు. నగరంలోని వీఆర్ కాలనీలోగల నైస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యాస్థాయి నుంచీ కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భం గా విద్యార్థులకు క్విజ్ పోటీలు, యువతకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పోటీలు నిర్వహించి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అంద జేశారు. కార్యక్రమంలో లక్ష్మీ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, కేవీఆర్ కళాశాల అధ్యాపకులు కే వెంకట నాగిరెడ్డి, బి. జ్యోతి, శివయ్య, నవీన్‌లతోపాటూ లయన్స్ క్లబ్, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలతో రాయపాటి శ్రీనివాస్ తదితరులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ రజక ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు వేంపెంట రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బీసీ భవన్‌లో జరిగిన రజక ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులు చాలీచాలని భత్యాలతో దుర్భ రమైన జీవితాలను గడుపుతున్నారని, మరికొన్ని చోట్ల గ్రామ బహిష్కరణలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తూ కేబినెట్‌లో తీర్మాణం చేసి పార్లమెంటుకు పంపారని, కేంద్రంలో అధికారంలో ఉన్న అప్పటి ప్రభుత్వం అనివార్య కారణాలతో పడి పోవడంతో ఈ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతూ బిల్లు అసెం బ్లీలో పెట్టి తీర్మాణం చేసి పార్లమెంటు బిల్లు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రజక ఐక్య సేవా సమితి కర్నూలు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు భారతి, కటారుకొండ సాయి కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేంపెంట రాంబాబు

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఎల్లారెడ్డికి పింఛన్ ఇస్తున్న డిజిటల్ అసిస్టెంట్

ఓర్వకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పింఛనుదారుడికి సచివాలయ ఉద్యోగి ఆసుపత్రికి వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. మండల కేంద్రమైన ఓర్వకల్లుకు చెందిన ఎస్.ఎల్లారెడ్డి మెదడు సంబంధిత వ్యాధితో గత తొమ్మిది రోజులుగా నంద్యాల పట్టణంలోని ఎంఎస్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ డబ్బులు తీసుకోవడానికి ఆయన రాలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న డిజిటల్ అసిస్టెంట్ రమేష్, టీడీపీ నాయకులు స్వామిరెడ్డి, జీకె.అల్లబాబు సోమవారం నంద్యాలకు వెళ్లి ఆస్పత్రిలో ఆయనకు రూ.4వేల పింఛన్ అందజేశారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు వీరికి కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా రామాంజనేయులు

గూడూరు డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణ వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా పుట్టపాశం రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని వాల్మీకి ఆలయంలో వాల్మీకి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పట్టణ వాల్మీకి సంఘాన్నా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుట్టపాశం రామాంజనే యులు, సెక్రటరీగా బోయగేరి కొండమీది కేశవులు, కోశాధికారిగా కురుకుంద విజయ కుమార్, అడిషనల్ సెక్రటరీగా పడమర బీసీ కాలనీ రేవుల వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. నూతనం కార్యవర్గానికి వాల్మీకి సంఘం పెద్దలు సన్మానించారు.

రసాయన ఎరువులు తగ్గించాలి: ఏవో

సి.బెళగల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా ఏవో మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు ఈకేవై సీ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నటేకూరు బీఆర్ అంబేద్కర్ ఐఐటీ మెడికల్ అకాడమి విద్యార్థులకు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ సోమవారం క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్ర మంలో ఐఐటీ మెడికల్ అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, ప్రిన్సిపాల్ మహానంది, ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, పీఈటీ కిరణ్, ప్రధ్యానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో బాలికలకు రక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌తో బాలికలకు రక్షణ కల్పిస్తుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. సోమవారం కొండారెడ్డి బురుజు సమీపంలో మున్సిపల్ పార్కులో తైక్వాండో శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు డాక్టర్ బి.శంకర్‌శర్మ బ్యాగులు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ

ఓర్వకల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్త సేకరణ కోసం చెత్త బుట్టలను ప్రతి ఇంటికి రెండేసి చొప్పున పంపిణీ చేస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఓర్వకల్లులో ఇంటింటికీ రెండు చొప్పున చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి పంచాయితీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. మండలానికి 28,688 చెత్త బుట్టలు వచ్చాయ న్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఎల్లారెడ్డి, అల్లాబాబు, ఏసేపు, శోభన్‌బాబు, రాజు, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, పంచాయితీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో మురుగు కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరం చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం కృష్ణానగర్, బిర్లాకాంపౌండు, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంతాల్లో పర్యటించారు. మురుగు కాలవల్లో నీరు ప్రవాహానికి ఆటంకం లేకుండా పూడిక తీత పనులు త్వరగా చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఈఈలు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఈ మనోహర్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ అనిల్ ఉన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.బెళగల్, కంబందహాల్, మారందొడ్డి గ్రామాల్లోని తాగునీటి పథ కాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ గోనెనాయక్ సోమవారం పరిశీలించారు. డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని మురుగు కాలు వల్లోని తాగునీటి పైపులైన్లు తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, కాలి పోయిన తాగునీటి విద్యుత్ మోటార్లు, చేతిపంపులను మరమ్మతులు చేయాలని అన్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు

కోడుమూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు అని ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక జోన్ కమిటీ అధ్యక్షుడు నాగార్జున అన్నారు. సోమవారం గోరంట్ల మజారా కొత్తపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు శ్రీకృష్ణుడి నిజభావం తెలియపరచారని అన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, బావన్న, సర్వేశ్వరయ్య, సుబ్బయ్య, శివకుమార్, సుంకన్న, శేషు, శ్రీరాములు, శివాజీ, లక్ష్మీ, లావణ్య, శశికళ పాల్గొన్నారు.

ఘనంగా అగ్ని గుండం సేవ

గూడూరు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజున గూడూరులోని వీరభద్రస్వామి ఆలయం వద్ద అగ్నిగుండం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి వీరభద్ర స్వామి ఆలయం దగ్గర ఎర్రటి నిప్పులతో అగ్ని గుండాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు శివనామస్మరణ చేస్తు అగ్ని గుండంలో నడిచి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఆలయంలో పార్వతీపరమేశ్వరుడికి, వీరభద్రుడికి పూజలు చేశారు. సోమవారం తెల్లవారుజామున పార్వతీపరమేశ్వరుడికి కళ్యాణం నిర్వహించారు.

కరాటే మాస్టర్ కోలా ప్రతాప్‌కు కాంస్య పతకం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నవంబరు 28 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు సింగపూర్‌లో జరిగిన ఆసియా ఫసిఫిక్ సీటోర్యు కరాటే చాంపియన్‌షిప్‌లో కరాటే మాస్టర్ కోలా ప్రతాప్ కాంస్య పతకం సాధించారు. కరాటే మాస్టర్ కోలా ప్రతాప్ మాట్లా డుతూ నా విజయానికి కారణమైన కోచ్ అరుణ్ మాచయ్య సెన్సేకి కృతజ్ఞతలు తెలిపారు.



కాంస్య పతకం అందుకున్న కోలా ప్రతాప్

పైపులైన్ ధ్వంసం

కోడుమూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వర్కూరు గ్రామానికి చెందిన రైతు బాటకాటి చిన్నయ్య పొలంలో పైపులైన్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. బాధిత రైతు చిన్నయ్య మాట్లాడుతూ తనకున్న రెండె కరాల పొలానికి డ్రిప్, పైపులు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉల్లి పంట సాగు చేశామన్నారు. అయితే గత రాత్రి దుండగులు డ్రిప్ వాల్వ్‌లు, పైపులు పగలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



దుండగులు ధ్వంసం చేసిన పైపులైన్

హైకోర్టు బెంచ్ ప్రకటించడం హర్షణీయం

మంత్రి లోకేశ్‌ను కలిసిన లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు

కర్నూలు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు హైకోర్టు బెంచ్ ప్రకటించడం హర్షణీయమని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ అన్నారు. సోమవారం అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలి పారు. లోకేశ్ తీసుకున్న చొరవతో బెంచ్ కర్నూలు ప్రకటించడం పట్ల రాయలసీమలోని న్యాయవాదులంతా హర్షం వ్యక్తం చేస్తున్నా రని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిల బెట్టుకోవడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జగదీష్

లోకేశ్‌ను కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు: విజయవాడలోని ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థి యుజన ప్రజా ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, మూర్తి తేజ, బేస్త జయసూర్య, బట్టేకల్లు సూర్య, రఘు, నూరు, అజయ్, ఉదయ్ పాల్గొన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో సామాజిక సేవలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో సోమవారం వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని సన్నితి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బజ్జీల బండి నిర్వహణకు రూ.11,500 విలువ చేసే గ్రైండర్‌ను దాతలు దివంగత కృష్ణమూర్తి ధర్మపత్ని నారాయణమ్మ కుటుంబ సభ్యులతో అందజేశారు. అలాగే అశోక్‌నగర్ సమీపంలోని లేబర్‌కాలనీలో వ్యాపారి రామాంజనేయులు టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించడానికి అవసరమయ్యే మూలధనాన్ని ఆవోపా ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఆవోపా అధ్యక్షుడు ఎంవీ సురేష్, చీఫ్ కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆవోపా గత 52 ఏళ్లలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు.

పార్లమెంట్‌లో ఎంపీల గళమేదీ?

కర్నూలు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్, ఇసుక మాఫియాపై పార్లమెంట్‌లో ఎంపీలు ఎందుకు గళం వినిపించ లేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొత్తురూ సత్యనారాయణ గుప్తా అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరగాల్సిన అభివృద్ధి, వెనుకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ గురించి పార్లమెంట్‌లో వినిపించకపోవడం బాధాకరమన్నారు. గత కొద్ది రోజులుగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న టీడీపీ, జనసేన, బీజేపీల ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్నారు. వెంటనే కేంద్ర ప్రభు త్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలని కోరారు.

18 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై పోలీసులు డ్రోన్‌తో కొరడా ఝుళిపించారు. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో నాలుగో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేశారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, సీఐ పవన్ కుమార్, నాలుగో పట్టణ ఎస్ఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ హుశేన్‌లు వీకర్‌సెక్షన్ కాలనీ, శరీన్ నగర్, ముజఫర్ నగర్ పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్లు 18 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీపీఐ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ నగర నిర్మాణ బాధ్యులు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ నగర సమితి శాఖ కార్యదర్శుల సమావేశాన్ని బీసన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో జి.చంద్రశేఖర్, డి.శ్రీనివాసరావు, నాగరాజు, అన్వర్, కుమార్, సోమన్న, గిడ్డమ్మ, రామాంజనేయులు, రామచంద్ర, నాగరాజు, భువన కుమార్, ధరెన్న, అంజినమ్మ, కోటమ్మ, నీలకంఠప్ప కుమార్, బాబయ్య, మల్లేష్, సులోచనమ్మ, కుమార్‌రాజా, మునెమ్మ పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో జిల్లాకు డబుల్ క్రౌన్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కావలి డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 1న రాష్ట్ర స్థాయి మినీ సబ్ జూనియర్ రగ్బీ పోటీల్లో కర్నూలు జిల్లా బాలబాలికలు ప్రథమ స్థానంలో నిలిచి డబుల్ క్రౌన్ సాధించారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద విజేతలకు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజ నేయులు మాట్లాడు తూ రాష్ట్ర స్థాయిలో 14 జిల్లాల జట్లు పోటీ పడగా. జిల్లా క్రీడాకారులు బాలబాలికల విభాగాల్లో మొదటి స్థానం సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. విజేతలకు రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు గుడిపల్లి సురేందర్, సుంకన్న, మహబూబ్ సుభాని అభినందనలు తెలిపారు.

పశుగ్రాసానికి ఉపాధి నిధులు

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల్లో పశుగ్రాసాన్ని సాగుచేసుకోడానికి ఉపాధి నిధులు ఇస్తామని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ సన్నచిన్నకారు రైతులకు ఉపయోగకరమన్నారు. 50 సెంట్లలో సాగు చేస్తే రూ.32,099లు, 40 సెంట్లకు రూ.26,394లు, 30 సెంట్లకు రూ19,795లు 20 సెంట్లకు రూ.13,197లు, 10 సెంట్లకు రూ.6599లు ఇస్తామన్నారు. ఆసక్తి గల రైతులు అప్లికేషన్ పారం, పొలం 1బీ, ఆదార్, బ్యాంక్ పాస్‌బుక్, రేషన్ జిరాక్స్ ప్రతులను ఇవ్వాలన్నారు. ఏడాది పాటు పశుగ్రాసం సాగుకు నిధులు అందుతాయని తెలిపారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న నాయకులు

ఆదోని టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండిగిరికి చెందిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి సోమవారం అన్నా క్యాంటిన్‌లో పేదలకు ఉన్నదానం చేశారు. టీడీపీ యువ నాయకుడు సిద్దార్థ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశామని తెలిపారు. డిష్ రవి, నరేంద్ర, సునీల్, సంధ్యారాణి, వెంకటేష్, రహేమాన్, వీరేష్ పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం


పెండేకల్లులో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

తుగ్గలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంతోనే పేదలు అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ నాయకుడు మాజీ సర్పంచ్ బర్మా వీరేష్ అన్నారు. సోమవారం పెండేకల్‌లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. బడుగుల అభివృద్ధికి పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు కృషి చేస్తున్నారన్నారు. రామచంద్ర, వోలప్ప, నాయుడు తదితరులు ఉన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం


కిడ్నీ బాధితుడికి నగదు అందజేస్తున్న సభ్యులు

ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాంతి నగర్‌కు చెందిన కిడ్నీ బాధితుడు శ్రీనివాసులుకు సహృదయ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.61,100లు అందజేశారు. శ్రీనివాసులు ఆటో నడిపేవాడు, అయితే కిడ్నీ వ్యాధికి గురవడంతో రెండేళ్లుగా ఇంటివద్దే ఉన్నాడు. సంపాదించినదంతా ఆసుపత్రులకే ఖర్చయిపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సభ్యులు రఘు, పెద్దయ్య, గిరి, ప్రకాష్ బాధితుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు.

వెండి కవచం బహూకరణ


వెండి కవచాన్ని అందజేస్తున్న భక్తుడు

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక యామన్నగేరి నర్సప్ప ఆలయానికి భక్తులు వెండి కవచాన్ని సోమవారం అందజేశారు. మద్దికెరకు చెందిన మంగళి గిడ్డయ్య, సుంకమ్మ దంపతుల కుమారులు వెంకటరాముడు, నాగరాజు, ఓబులేసు రూ.50వేల కవచాన్ని ఇచ్చారని నిర్వాహకుడు నాగరాజు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు వీరేంద్ర, రాంనగర్ సోము, రామకృష్ణ, సుదర్శన్, శేఖర్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారి స్నేహలత

ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విద్యార్థినులను సిద్ధం కావాలని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి స్నేహలత సూచించారు. సోమవారం ఆలూరు కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. పరీక్షలకు విద్యాశాఖ వంద రోజుల ప్రణాళిక చేపట్టిందని, మూడు నెలలు చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్‌వో సుహాసినికి సూచించారు. అనంతరం వంట గదిని పరిశీలించి, విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా సౌకర్యం


టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న భాస్కర్ రెడ్డి

ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రూ.వంద చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా సౌకర్యం లభిస్తుందని ఆ పార్టీ నాయకుడు భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యకర్త ప్రమాదంలో, సహజంగా మరణించినా సాయం అందుతుందన్నారు. సౌదీ రావూఫ్, రామచంద్రప్ప, పక్రుద్దీన్, మల్లికార్జున, నాగరాజు, మద్దికేర రామకృష్ణ, ఇస్మాయిల్, గోవిందప్ప పాల్గొన్నారు.

ముద్దగా అన్నం

- సంక్షేమ హాస్టళ్లకు నాసిరకమైన బియ్యం సరఫరా
- తినలేక పడేస్తున్న విద్యార్థులు


ఈ అన్నాన్నే విద్యార్థులకు వడ్డిస్తున్నారు

ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు నాసిరకం బియ్యాన్ని సరఫరా చేస్తుండటంతో విద్యార్థులు తినేందుకు ఇష్టపడటం లేదని వార్డెన్లు వాపోతున్నారు.

గతంలో ఫోర్టిఫైడ్ బియ్యం

ఆలూరు సివిల్ స్టాక్ పాయింట్ పరిధిలో 13 సంక్షేమ హాస్టళ్లు ఉండగా 202 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి నెలా 450 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. గతంలో సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఫోర్టిఫైడ్ బియాన్ని సరఫరా చేసేవారు. అయితే దాదాపు సంవత్సరం నుంచి నాసిరకం బియ్యం వస్తున్నట్లు వార్డెన్లు అంటున్నారు. ఆలూరు పరిధిలోని సివిల్ సప్లయి గోదాం నుంచే నాసిరకం బియ్యం సరఫరా అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

తినలేక పడేస్తున్న విద్యార్థులు

ఈ బియ్యంతో అన్నం వండితే ముద్దగా మారుతుండటంతో విద్యార్థులు కడుపునిండా తినలేక పోతున్నారు. అన్నాన్ని పడేస్తున్నారు. ఇటీవలే ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి గిరిజన బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో బియ్యం నాసిరకంగా ఉందని, వంట మనుషులు ఫిర్యాదు చేశారు. అన్నం ముద్దగా వస్తే పిల్లలు అతినడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

● ఈ విషయాన్ని సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ నాగసుధను వివరణ కోరగా విచారించి నాణ్యమైన బియ్యం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఆలూరు సివిల్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి బసవన్న గౌడ్‌కు ఫోన్‌చేసి అరా తీసి, ఎందుకు ఇలాంటి బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు. స్పందించిన ఇన్‌చార్జి ప్రభుత్వం నుంచి వస్తున్న బియ్యాన్నే సరఫరా చేస్తున్నామని తెలిపారు. ముద్దగా మారిన అన్నం ఫోటోలు పంపాలని ఆమె ఆదేశించారు..

పశుగణన చేయించుకోవాలి

తుగ్గలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశుగణన తప్పక చేయించుకోవాలని పశువైద్యాధికారులు ప్రణతి, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం తుగ్గలి, జొన్నగిరి, ముక్కెళ్లలో పశుగణనపై అవగాహన కల్పించారు. టీకాలు, మందులు లభిస్తాయని, ప్రమాదం చోటు చేసుకుంటే నష్టపరిహారం అందజేస్తారన్నారు.

నియామకంపై ఫిర్యాదు

పత్తికొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలానికి చెందిన ఓ మహిళను పత్తికొండ మండల వీవోఏగా అక్రమంగా నియమించారని, పొదుపు మహిళలు సోమవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. సోమవారం భారతి ఐక్య సంఘం సభ్యులు హనుమంతమ్మ, పద్మావతి మాట్లాడుతూ భారతి ఐక్య సంఘాల సభ్యురాలు కాని తుగ్గలి మండలం రాతన గ్రామానికి చెందిన వీరమ్మను వీవోఏగా దొంగ సంతకాలు, తీర్మానాలతో నియమించారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు విచారణ చేసి తొలగించాలని కోరారు.

సమస్యలను పరిష్కరించండి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించారు. మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. ఆదోని పట్టణం వైఎస్సార్ నగర్ 3వ లైనులో తాగునీటి పైపులైన్ లేదని, బోరు పని చేయడం లేదని కాలనీ ప్రజలు అర్జీ సమర్పించారు.
2. తనకు సర్వేనెంబరు 266లో 2.63 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించించదని, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని పెద్దకడూరు మండలం హలికన్వి గ్రామానికి చెందిన బి.దత్తాత్రేయ అర్జీ ఇచ్చారు.
3. ఆదోని మండలం గణేకల్ గ్రామానికి చెందిన ఆంజనేయ తనకు సర్వే నెంబర్ 17లో 1.26 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్, అడంగల్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
4. తనకు సర్వేనెంబర్ 51లో 7.33 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాస్ పుస్తకం ఇవ్వాలని ఆదోని మండలం బసర కోడు గ్రామానికి చెందిన అంజనప్ప అర్జీ ఇచ్చారు. సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణు సూర్య, హౌసింగ్ డీఈ రవి కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, డిప్యూటీ డీఎంహెచ్వో సత్యవతి, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వరులు, డిప్యూటీ డీఈవో వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ రీజినల్ ఇన్‌చార్జ్ మోపిరి సూర్య కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. హిందూ పరిరక్షణ సంస్థల పేరుతో ఆలయ భూములను ఆక్రమించి అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అర్హులకే ఆ భూములు ఇవ్వాలని కోరారు.

ఆలయాల భూములను రక్షించండి

ఆదోని రూరల్: జిల్లాలోని ఆలయ భూములు అన్యాక్రాంత మవుతున్నాయని రక్షించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ రీజినల్ ఇంచార్జి మోపిరి సూర్య కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.

బాలుడికి విద్యుదాఘాతం

దేవనకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వాల్మీకి ఆలయ గేటుకు విద్యుత్ సరఫరా కావడంతో బాలుడు వినయ్(11) విద్యుదాఘాతానికి గురయ్యాడు. సోమవారం ఉదయం వర్షం కురవడంతో ఆలయ గేటుకి విద్యుత్ సరఫరా అయింది. విషయం తెలియని బాలుడు గేటుని పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు కట్టెలతో బాలుడుని లాగేసి, వైద్యశాలకు తరలించగా ప్రమాదం వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విద్యుత్ సిబ్బంది ఆలయ గేటు వద్ద తీగలను సరిచేశారు.

సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యం


పరిశీలిస్తున్న తహసీల్దార్ హుశేన్ సాహెబ్

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలతో ఆరోగ్యం వస్తుందని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సీఆర్‌పీ భీమరాజు అన్నారు. సోమవారం సేంద్రీయ ఎరువుల ద్వారా పండించిన కూరగాయల స్టాల్స్‌ను పరిశీలించారు. రసాయనాలతో పండించిన కూరగాయలు తింటే ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. హంపా, ఎం.అగ్రహారం గ్రామాల్లోని 200 ఎకరాల్లో వివిధ కూరగాయలను సాగు చేశారన్నారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

పంట నమోదు చేసుకోవాలి: ఏడీఏ

- రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయాధికారులు


పత్తికొండ: హోసూరులో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏవో

పత్తికొండ/టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రబీలో పంట నమోదు తప్పక చేసుకోవాలని ఏడీఏ మోహన విజయకుమార్ సూచించారు. సోమవారం పత్తికొండ మండలం హోసూరులో పంటనమోదును సోమవారం పరిశీలించారు. ఈనెల 15లోగా బీమా ప్రీమియాన్ని చెల్లించాలని, పప్పుశనగకు రూ.420లు, వేరుశనగకు రూ.480లు, జొన్నకు రూ.297లు, ఉల్లికి రూ.1,350లు, టమోటాకు రూ.1,500లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏవో వెంకటరాముడు సిబ్బంది రియాజ్, బాషా, శ్రీనివాసులు, శివప్రసాద్, రమేష్ ఉన్నారు.

మద్దికెర: రైతులు రబీలో సాగు చేసిన శనగ, వాము, జొన్న పంటలకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో రవి సూచించారు. సోమవారం మద్దికెరర, ఎం.అగ్రహారం గ్రామాల్లో ఈక్రాప్ నమోదును తనిఖీ చేశారు. సిబ్బంది జాకీర్, ఆనంద్, కవిత, రాణి ఉన్నారు.

తుగ్గలి: రబీలో పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించడం తప్పనిసరని తహసీల్దార్ రమాదేవి, ఏవో పవన్ కుమార్ సూచించారు. సోమవారం తుగ్గలిలో ఈ-క్రాప్ నమోదును ప్రారంభించారు. ఈక్రాప్ చేయకుంటే ప్రభుత్వ సబ్సిడీ, పంట నష్టపరిహారం, బీమా, సున్నావడ్డీ, పంట కొనుగోలు అందవన్నారు. బీమా ప్రీమియాన్ని ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలన్నారు. వీఆర్వో నవీద్ పటేల్, ఎంపీఈవో స్రవంతి, వీఏవో లోహిత్ కుమార్ ఉన్నారు.

జయప్రదం చేయండి

ఆదోని రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళవారం నిర్వహించనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు దుగ్యప్ప కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మండల కార్యాలయ ఆవరణలో ఉంటుందని, దివ్యాంగులు చేరుకోవాలని కోరారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- ఆర్డీవో భరత్ నాయక్
- నీటి సంఘాల ఎన్నికలకు శిక్షణ


మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాగునీటి ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీవో భరత్‌నాయక్ అధికారులకు సూచించారు. పత్తికొండ రమ్యారిసార్ట్‌లో సోమవారం పత్తికొండ డివిజన్ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికల శిక్షణాను ఎన్నికల రిసోర్స్ పర్సన్ రియాజ్ ఆధ్వర్యంలో ఇచ్చారు. సాగునీటి సంఘాల్లో రైతులను భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ విధానాన్ని తెచ్చిందన్నారు. ఈ కమిటీల ఏర్పాటువల్ల సాగునీరు ఆయకట్టుపొలాలకు పూర్తిస్థాయిలో అందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ సమయానికి తహసీల్దార్లు ధ్రువీకరించి ముద్రించబడిన రైతులను ఓటర్లుగా పరిగణించాలన్నారు. నామినేషన్, నామినేషన్ల తరిస్కరణ, ఎన్నికల ధ్రువీకరణ ఎన్నికల నియమావళి ప్రకారం చేయాలన్నారు. ఓటర్లు హాజరుకాకపోయినా, ఇబ్బంది కలిగినా ఎన్నికలు నిలిపివేసి ఫాం9సి ద్వారా కలెక్టర్‌కు తెలియచేయాలన్నారు.

చార్జీల పెంపులో మాట తప్పిన సీఎం

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు విషయంలో సీఎం చంద్రబాబు మాట తప్పారని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి విమర్శించారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికల ప్రచారం చేస్తూ విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే చార్జీలు పెంచి ప్రజలపై బాదుడు వేశార న్నారు. అవినీతి రహిత పాలనను అందిస్తానని ప్రగల్బాలు పలుకుతుండగా మరోవైపు ఆయనకు తెలీకుండనే కాకినాడ పోర్ట్ నుంచి రేషన్ బియ్యం విదేశాలకు తరలిస్తునరన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ పోర్టులోకి తనను అనుమతించలేదని చెప్ప డం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీ తప్ప చేసిందేమీ లేదన్నారు. వైసీపీ నాయకులు భాస్కర్, కిషోర్, అరికెర వీరేష్, బాబు, జాన్, వరుణ్, నాగేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు : ఎంఈవో


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో ఏజెన్సీలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంఈవో శ్రీనివాసులు హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 30న తినేస్తున్నారు శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించారు. డీఈవో శామ్యూల్ పాల్ ఆదేశాలతో మరో మారు తనిఖీ చేశారు. వంట ఏజెన్సీలో ఎంతమంది పనిచేస్తున్నారు. శనివారం ఎంతమందికి ఎన్ని కేజీల బియ్యాన్ని వడ్డించారన్న విషయాలను విచారించారు. విద్యార్థుల సంఖ్య కనుగుణంగా, మెనూ ప్రకారం బియ్యం కొలతల్లో తారతమ్యాలు లేకుండా భోజనాన్ని వడ్డించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బోజన నాణ్యతను పర్యవేక్షణ చేయాలని తెలిపారు. వివరాలను డీఈవోకి అందిస్తామని తెలిపారు.

బాక్సింగ్ కిట్ల పంపిణీ


కిట్లను పంపిణీ చేస్తున్న తల్లిదండ్రులు

ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యార్థినులను ప్రోత్సహించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకొచ్చారు. సోమవారం విద్యార్థిని అశ్విత తల్లిదండ్రులు వీరేష్, లక్ష్మీనరసమ్మ బాక్సింగ్ క్రీడాకారులకు కిట్లను విరాళంగా అందించారు. విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చిన వారికి జీసీడీవో స్నేహలత, ప్రిన్సిపాల్ సుహసిని, పీఈటీ సులోచన అభినందించారు.

మున్సిపల్ సమావేశాలు హుందాగా సాగాలి

ఆదోని టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే మునిసిపల్ కౌన్సిల్ సమావేశాలు హుందాగా సాగాలని సీపీఐ కార్యదర్శి సుదర్శన్, సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి, రైతు సంఘం నాయకుడు బసాపురం గోపాల్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ కౌన్సిలర్లు కుర్చీల కోసం కుమ్ములాడుతూ, పరస్పర దూషణలతో సమయాన్ని వృథా చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పాత బస్టాండ్‌లో నిర్మిస్తున్న మునిసిపల్ కమర్షియల్ కాంప్లెక్స్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయయని, వ్యాపారులు రూ.4కోట్లు చెల్లించి ఏడాది గడిచినా పనులు జరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు. ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ సహాయ కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొన్నారు.


అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకోం

ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోమని వీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారెళ్ల అంజి అన్నారు. సోమవారం మంగళ ఆంజనేయ ఆలయంలో నిర్వహించిన బోయ వాల్మీకి సమితి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాయలసీమ జిల్లాల బోయ వాల్మీకి సమితి అధ్యక్షుడిగా మాజీ జడ్పీటీసీ రాంభీంనాయుడుని ఏన్నుకున్నారు. ఎన్నికయ్యారు. మాజీ కౌన్సిలర్లు సింహం నాగేంద్ర, సురేంద్ర, సాయిప్రసాద్, రంగన్న, భోజ, రమేష్, వెంకటేష్, బ్యాంకు మల్లికార్జున, లోకేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పత్తికొండ డీఎల్‌పీవో వీరభద్రప్ప



ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో పత్తికొండ డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రప్ప అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: డివిజన్‌లో ఎన్ని పంచాయతీలున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంత వచ్చాయి?

జవాబు: డివిజన్‌లోని 155 గ్రామ పంచాయతీలుండగా, మొదటి విడతగా రూ.10.98లక్షలు మంజూరయ్యాయి. ఇవి నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ అవుతాయి. 60శాతం నిధులు పారిశుధ్యానికి ఖర్చు చేయాలి.

ప్రశ్న: పారిశుధ్య నిర్వహణకు చర్యలు?

జవాబు: డ్రెయిన్లు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ జల్లిస్తున్నాం. కాల్వలో లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ వేస్తున్నాము.

ప్రశ్న: అన్ని పంచాయతీలకు కార్యదర్శులున్నారా?

జవాబు: మొత్తం 155 పంచాయతీలుండగా, 110 మంది ఉన్నారు. ఆస్పరి మండలంలో మొత్తం 21 పంచాయతీలకు 8 మంది మాత్రమే ఉన్నారు. ఖాళీల భర్తీకి నివేదికలు పంపాము.

ప్రశ్న: భూ హక్కు ధ్రువీక రణ పత్రాలు ఇవ్వడం లేదనే ఫిర్యాదులున్నాయి?

జవాబు: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఖాళీ స్థలాలు, భూములు, భవనాలకు పంచాయతీ కార్యదర్శులు భూయాజమాన్య ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకూడదు. అలా ఇస్తే చర్య తీసుకుంటాము.

ప్రశ్న: దోమల నియంత్రణకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు అధికంగా ఉన్నట్లైతే ఫాగింగ్ చేయిస్తున్నాము.

వ్యాపారులకు బీవీ కుటుంబం అండ



ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వ్యాపారులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపారులకు బీవీ కుటుంబం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పెద్దకటికే వ్యాపారులు 500మంది టీడీపీ నాయకులు బందే నవాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన ఇబ్రహీం, బందేనవాజ్, రహంతుల్లా, ఇలియాస్, జాకీర్, సత్తార్‌లతో పాటు ఇతరులకు కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు సాబీర్, గుల్లా సలాం, సలీం, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, అల్తాఫ్ పాల్గొన్నారు.

కర్ణాటక బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొని బుడగజంగాల తాయిలన్న అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం సోమవారం రాత్రి జరిగింది. మంత్రాలయం పోలీసులు మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు రాయచూరు నుంచి మంత్రాలయం వస్తున్న కర్ణాటక ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు చెట్నహళ్లి గ్రామానికి చెందిన బుడగజంగం తాయిలన్న భిక్షాటన చేస్తూ జీవించేవాడు. ఆలయం ముందు భిక్షాటన చేస్తూ రోడ్డు దాటుతుండగా.. కర్ణాటక బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కొడుకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

అదనపు కట్నం కేసు నమోదు

గోనెగండ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసిన భర్త కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామానికి చెందిన కురవ సుజాతను మూడేళ్ల క్రితం పత్తికొండ గ్రామానికి చెందిన మల్లికార్జునకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గత రెండేళ్లుగా అదనపు కట్నం తీసుకురావాలని సుజాతను భర్త మల్లికార్జున, మరిది లక్ష్మీకాంతం, అత్త ఎల్లమ్మ, మామ మల్లికార్జున, ఆడబిడ్డ కామాక్షి, ఆడబిడ్డ భర్త సుంకన్న మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలు పెట్టారు. వీరి మనసు మారి తన కాపురం నిలుస్తుందని సుజాత ఎంతో ఓపిక పట్టింది. అయితే రెండేళ్లనుంచి వేదింపులలో మార్పు రాకపోవడం తోపాటు ఇక వీరు మారరు అని తలచి సోమవారం గోనెగండ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వెండి కడియాల అపహరణ

గోనెగండ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలోని మొట్టివీధిలో నివాసం ఉంటున్న బండా సన్నమ్మకు చెందిన ఆరు వెండి కడియాలు అపహరణకు గురైనట్లు బాధితురాలి కుమారుడు బండా రంగస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు బండా సన్నమ్మ ఇంటి అరుగుపై కుర్చొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి సన్నమ్మకు చేతులకు ఉన్న ఆరు వెండి కడియాలని దొంగలించుకుపోయినట్లు తెలిపారు. వాటి దాదాపు రూ.50వేలు ఉంటాయని తెలిపారు. 85 ఏళ్ల వృద్ధురాలు కావడంతో వ్యక్తి గుర్తు పట్టలేక పోయిందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



సచివాలయ సిబ్బందితో కలిసి పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఐ

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ అన్నారు. సోమవారం మంత్రాలయం, వగరూరు, వి.తిమ్మాపురం గ్రామాల్లో సచివాలయ కార్యాలయం ముందు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలన్న పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాగరాజు, లక్ష్మన్న, విజయ్, వీరేష్, ప్రభాకర్, మధు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

పెద్దకడుబూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బసలదొడ్డిలో వెలసిన ఆంజనేయస్వామిని పలువురు పూజలు చేశారు. సోమవారం కార్తీక మాసోత్సవం సందర్భంగా ఆంజనేయ స్వామి జాతర నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్యాలకుర్తి దివాకరరెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, నీలకంఠారెడ్డి, అన్నమయ్య, సత్యనారాయణ, మల్లేష్, హోమాన్, రామాంజనేయులు, రమేష్, వీరేష్, రంగనాథ్ ఉన్నారు.

పగలే వెలుగుతున్నాయ్

గోనెగండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రభుత్వం ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేసింది. కానీ మండలంలోని చాలా గ్రామాల్లో పగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. గోనెగండ్లలోని దరగల వీధి, కురువ వీధిల్లో, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, వేముగోడు, అలువాల, పిల్లిగుండ్ల, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, తిప్పనూరు, కూర్నూరు తదితర గ్రామాల్లోని కొన్ని వీధుల్లో కొన్ని రోజులుగా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కరెంట్‌ను ఆదా చేయాల్సిన అవసరం ఉంది.

ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు వారు ధర్నా చేశారు. కార్మికుల సమస్యలను ఈనెల 8లోపు పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప, యంనారాయణ, మధు పాల్గొన్నారు.

నాటి కౌశికాపురమే.. నేటి కోసిగి

- కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు... కోసిగయ్య స్వామి
- దేవుని పేరే.. ఊరి పేరుగా ప్రసిద్ధి
- నేడు కోసిగయ్య స్వామికి కార్తీక పూజలు

కోసిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) ప్రసిద్ధి. దేవుడి పేరునే కోసిగి గ్రామంగా మారిన వైనం. కోసిగి ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కోసిగయ్య స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు.



పూజందుకుంటున్న కోసిగయ్య స్వామి

కార్తీకమాసంలో నెల రోజుల పాటు ఆంజనేయస్వామికి భక్తులు ఆకుపూజలు, కుంకుమార్చన పూజలు చేసి దీపారాధన చేసి తమ మొక్కులు తీర్చుకుంటూ వారి కోర్కెలు తీర్చే దేవునిగా కోసిగిలోని మూడవ వార్డులో వెలసిన కోసిగయ్య



కోసిగయ్య స్వామి ఆలయం

ఆలయంలోని కోసిగయ్య స్వామికి పెట్టింది పేరుగా భక్తుల నమ్మకం. కార్తీకమాసంలో మంగళవారం ఆలయంలో మార్గశిర శుద్ధ పాడ్యమి రోజున కార్తీకమాస పూజలు కట్టి స్వామివారికి పుష్పాలంకరణలో ఆలయ అర్చకులతో పాటు దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు, మేటీ గౌళ్లు, పాలేగార్ దొరల వంశస్థులు పెద్ద ఎత్తున పూజలు చేస్తారు. అనంతరం విదియ రోజున స్వామివారి కార్తీక పూజ ముగించే కార్యక్రమానికి గ్రామ పెద్దలు, గౌళ్లు, దొరల వంశస్తులు, పురోహితుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ అర్చకుడు పూజారి శ్రీరాములు తెలిపారు. భక్తులు సోమవారం అర్ధరాత్రి నుంచే మంగళవారం ఉదయం వరకు స్వామివారి ఆలయంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సరికాదు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీటర్లు బిగించడం సరికాదని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి ఏసేపు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల ప్రయోజనాల గురించి ఆలోచించే పరిస్థితుల్లో లేరన్నారు. నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని లేని పక్షంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులతో కలిసి పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చిన్న, లక్ష్మన్న, రాజు పాల్గొన్నారు.

● విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని వైఎస్ఆర్‌సీపీ వీరశైవ లింగాయత్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు వై రుద్రగౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగావిద్యుత్ శాఖ కార్యాలయం వరకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నాయకు లు సునీల్, నాగేషప్పతో కలిసి ఏడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల్లో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు వాతలు పెట్టిన చంద్ర బాబు తమ పార్టీపై నిందలు వేయడం దారుణమన్నారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్‌చార్జీలు పెంచనని చెప్పి ఇప్పుడు ఇష్టారీతిన పెంచుతూ పోతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు స్కూల్



ఏడీకి వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

ఫీజుల మోతకు తోడు విద్యుత్ చార్జీలు సామాన్యుడిపై పెనుభారం పడుతుందని అన్నారు. కార్యక్రమం లో వైస్ చైర్మన్ నజీర్, గడ్డం నారాయణ రెడ్డి, విరుపాక్షి రెడ్డి, కొమ్ము రాజు పాల్గొన్నారు.

మంత్రాలయం: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంటు చార్జీలు పెంచేది లేదని చెప్పి.. పెంచేశారని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మంచాల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డి ఆరోపించారు. సోమవారం రాంపురంలో వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వ్యవసాయ సల హా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, మురళిరెడ్డి, చెట్న హళ్లి సర్పంచ్ బెస్త ఆంజనేయులు, మాజీ సర్పంచులు కురువ అల్లింగప్ప, వెంకటేశ్, నర్సప్ప, ఎంపీటీసీ రామాంజనేయులు, చంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

సన్నబియ్యం సరఫరా చేయాలి



జడ్పీ ఉన్నతపాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు వీరేష్ యాదవ్, నరసన్న, ఉసేన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్నన భోజనాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా లేకపోవటంతో విద్యార్థులకు పెట్టే భోజనం సరిగా లేదన్నారు.

ఘనంగా బీరప్ప దేవర



బీరప్ప స్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

నందవరం, డిసెంబరు 2(డిసెంబరు): మండల కేంద్రమైన నందవరం సోమవారం బీరప్ప దేవర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బీరప్ప స్వామిని తుంగభద్ర నది తీరంకు తీసుకుకెళ్లి ప్రత్యేక పూజలు చేసి నందవరానికి తీసుకువచ్చి మొదటిగా చౌడేశ్వరిలో అనంతరం ఆంజినేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల గుండా బీరప్ప స్వామిని ఊరేగించారు. కురబ సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, మద్దిలేటిలకు స్వాగతం పలికి సన్మానించారు.

మిర్చి రైతుకు తుఫాన్ గండం



ఆరుబయట ఆరబోసిన మిరప

గోనెగండ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో సాగు చేసుకున్న మిర్చి పంట ఇప్పుడు చేతికి అందే సమయంలో నాలుగు రోజులుగా తుఫాన్ గండం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గోనెగండ్ల మండలంలో కులుమాల, అలువాల, చిన్నమరివీడు, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, పుట్టపాశం, వేముగోడు గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలలో మిరప పంటను అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత చేపడుతున్నారు. మంచు కురుస్తుండటంతో మిర్చి దిగుబడి దెబ్బతిని ధరలపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మంచు కురుస్తున్న కారణంగా టార్పాలిన్‌తో కప్పి ఉంచడం వల్ల పంట మగ్గిపోయి రంగు మారిపోతుందని రైతులు వాపోతున్నారు.

టీడీపీతోనే కురువల అభివృద్ధి

నందవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే కురువల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కురవ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామకృష్ణ, కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. సోమవారం నందవరంలో కురువ సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురువలకు టీడీపీ పార్టీలో సముచిత స్థానం కల్పించిందన్నారు. త్వరలో కురువలకు గొర్రెలు, మేకల పెంపకం రుణాలు కూడా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కురువ సంఘం నాయకులు మల్లికార్జున, నూగురప్ప, వెంకటప్ప, పూజారి శ్రీనివాసులు జాలవాడి అంజనేయులు, బీరప్ప, సంఘం నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



మంత్రి లోకేశ్‌కు పోస్ట్ చేస్తున్న విద్యార్థి నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ పాఠశాల ప్రిన్సిపాల్‌కు వత్తాసు పలుకుతూ రీ పోస్టింగ్‌ను రద్దు చేయకుండా కాలాయాపన చేస్తున్న విద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, మహేంద్రబాబు, రఘునాథ్, కృష్ణ కోరారు. సోమవారం పట్టణంలో తపాలా కార్యాలయం నుంచి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పోస్ట్ కార్డు ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ మూడు నెలల క్రితం ప్రిన్సిపాల్‌పై విచారణ చేసి విద్యార్థుల నిధులను దుర్వినియోగం చేశారని నివేదిక ఇచ్చి, మళ్లీ రీ పోస్టింగ్ చేయడం దారుణమని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయని విద్యాధికారులను విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ రీ పోస్టింగ్‌ను రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పోస్ట్ ద్వారా పంపారు. కలెక్టర్ స్పందించి అవినీతి ప్రిన్సిపాల్‌ను తొలగించాలని, లేని పక్షంలో నిరాహార దీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షాహి ద్ ఆఫ్రిది, వెంకటేష్, నాగరాజు, నవీన్, బాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, తిక్కన్న, రాముడు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు, మంత్రాలయం హైవేపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 నెలలుగా తాగునీరు సక్రమంగా రావడం లేదని, అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్రాముడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, మండల మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విశ్వనాథరెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాముడు, మాజీ సర్పంచ్ నర్సన్న, ఎండీ షఫీ, వెంకటేష్, పెద్దయ్య, మాదన్న, వెంకటరెడ్డి, ఉచ్చప్ప, రంగమ్మ, పెద్దయ్య, రాజు, దేవపుత్ర, దానియేలు, ప్రకాశం, అంజి, వినోద్ కుమార్, మహానంది, నారాయణలు పాల్గొన్నారు.

సీతారాముల ప్రభోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి గ్రామంలో వెలసిన సీతారాముల స్వామి రథోత్సవం, ప్రభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వ హించారు. స్వామివారికి ఉదయం నుంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ పెద్ద చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి నుంచి కుంభో త్సవాన్ని నిర్వహించి ఉత్సవ మూర్తులను రథోత్సవంపై ఆశీనులను చేసి ఊరేగిం చారు. ఎస్ఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి ప్రభోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



ఆంజనేయస్వామి ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

రమణీయం.. శివపార్వతుల రథోత్సవం



శివపార్వతుల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో శివపార్వతుల రథోత్సవం వైభంగా నిర్వహించారు. సోమవారం రాత్రి కార్తీకమాస పూజలను పురస్కరించుకుని శివపార్వతులకు, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామిని, శివపార్వతులను రథంపై ఏర్పాటుచేసి గ్రామ వీధుల గుండా గొరవయ్యల నృత్యాలు, మంగళవాయిద్యాలు, డీజేల మధ్య టపాసులు కాలుస్తూ ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధగ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు పరమేష్ నాయక్, విజయకుమార్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీరాంజనేయులు భాస్కర్, గురుమూర్తి, సర్పంచ్ ముకురన్న, రోగెప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం సరికాదు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పింఛన్లు తొలగించడం సరికాదని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు, ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్‌యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి గోవర్ధనమ్మ, శైలజ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్ఐ లక్ష్మన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కోసిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈ నెల 5న నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట మహాసభలను జయప్రదం చేయాలని మతోన్మాదుల చెర నుంచి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ అన్నారు. సోమవారం కోసిగిలోని డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఓంకారయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాస్కర్ యాదవ్, జిల్లా సమితి సభ్యులు తిమ్మయ్య, కోసిగి, కౌతాళం సీపీఎం మండల కార్యదర్శులు గోపాల్, ఈరన్న, లక్ష్మణ్, దావీదు, ఆంజనేయులు, స్వామిదాసు తదితరులున్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

కోసిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో తాగునీటి ఎద్దడి నివారణకు బోరు వేయిస్తున్నట్లు సాతనూరు యూత్ సభ్యులు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ స్ఫూర్తితో జనజీవన్ ఫౌండేషన్ అధ్యక్షుడు నవాజ్, మదర్ థెరిసా యూత్ అధ్యక్షుడు నజీర్ రూ.65వేలతో బోరు వేయించడంతో మూడించుల నీరు పడింది. దాంతో హెచ్ఎం ఖలీల్, ఉపాధ్యాయులు విద్యార్థులు యూత్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఇరుముడులతో బయలుదేరిన భక్తులు

కోసిగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని శ్రీరాముల వారి ఆలయంలో గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి మాలలు ధరించిన భక్తులు బావిగడ్డ గిరిబాబు, మణికంఠ, విష్ణు సోమవారం ఆలయ పురోహితుడు మూర్తిస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు ధరించి తిరుమల తిరుపతిలోని బేడీ ఆంజనేయస్వామి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. ఉదయం కోసిగిలోని శ్రీరాములవారికి పంచామృతాభిషేకం, మంగళహారతి వంటి పూజలు చేసి అనంతరం ఆంజనేయస్వామికి సింధూరం, అర్చన తీర్థ ప్రసాదాలు తదితర పూజలు చేశారు. అనంతరం వీరికి అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి భక్తులు గురుస్వాములు ముత్తురెడ్డి, వక్రాణి గోవిందు, తోవి గోవిందు, తోవి రామకృష్ణ, పెండేకల్ ఈరన్న, హనుమంతు, దానం, రాజశేకర్, కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. సోమవారం పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

'బాల్యాన్ని రక్షించాలి'



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కోసిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో బాల్య వివాహాలు అరికట్టి బాల్యాన్ని రక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్‌లో ఆర్‌డీటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, ఆర్‌డీటీ కోసిగి ఏరియా టీం లీడర్ కృష్ణయ్య, ఆదినారాయణ, భాగ్యలక్ష్మి, నాగేంద్ర, వీరేష్ తదితరులు ఉన్నారు.

ఇంటి స్థలాలను కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న హోంగార్డులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పనిచేస్తున్న హోంగార్డులకు ఇంటి స్థలాలను కేటాయించాలని హోంగార్డులు భాస్కర్‌రెడ్డి, కృష్ణ, చెన్నప్ప, మున్న, గోపాల్‌రావు, నరసింహులు, గోవిందు, గోపాల్, ఫయాజ్ కోరారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా ఇంటి స్థలాల కోసం పోరాడుతున్నామన్నారు. అతితక్కువ వేతనం జీవనం సాగిస్తున్న తమకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు.